మత్స్య సంపద వృద్ధికి సముద్రంలో కృత్రిమ ఆవాసాలు

· 8లో

- సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సూచనలతో దేశవ్యాప్తంగా ఏర్పాటు
- ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో అనువైన ప్రాంతాల కోసం అన్వేషణ



కూలి డబ్బులకు నిరీక్షణ

ఉపాధి పథకం కూలీలకు ఏడు వారాల నుంచి అందని వేతనాలు

- నిబంధనల ప్రకారం అప్‌లోడ్ చేసిన పక్షం రోజుల్లో డబ్బులు జమ
- కోటవురట్ల మండలంలో రూ.1.65 కోట్ల వేతన బకాయిలు
- ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న కూలీలు



సుంకపూర్ చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కోటవురట్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి):

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు వేతనాల కోసం నెల రోజుల నుంచి ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్ వ్యవసాయ పనులు డిసెంబరులోనే ముగియడం, జిల్లాలో రబీ సాగు నామమాత్రంగానే వుండడంతో కొద్దిమంది కూలీలకు మాత్రమే పొలం పనులు లభిస్తున్నాయి. దీంతో ఎక్కువ మంది కూలీలు ఉపాధి హామీ పథకం పనులపైనే ఆధారపడ్డారు. జనవరి మొదటి వారం నుంచి చెరువులు, ఇతర సాగునీటి వనరుల్లో పూడికతీత పనులు చేస్తుండగా, ఇంతవరకు ఒక్కసారి కూడా కూలి డబ్బులు బ్యాంకు ఖాతాల్లో పడలేదని వాపోతున్నారు.

గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులు అంతగా లేకపోవడంతో జాబ్ కార్డు వున్న ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒక్కరైనా ఉపాధి పనులకు వెళుతున్నారు. ప్రతి కుటుంబానికి ఏడాదిలో వంద రోజులకు తగ్గకుండా పనికల్పించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో కూలీలకు పనులు కల్పిస్తున్నారు. పనిలోకి వచ్చిన కూలీ పేరు, చేసిన పని పరిమాణాన్ని రోజూ ఫీల్డు అసిస్టెంట్‌లు ఆన్‌లైన్‌లో నమోదుచేస్తారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ వారానికి ఒకసారి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పోర్టల్‌కు అప్‌లోడ్ చేస్తారు. రెండు వారాల్లోగా కూలీల ఖాతాలకు సొమ్ము జమ కావాలి. కానీ జిల్లాలో ఉపాధి హామీ పథకం కూలీలకు ఏడు వారాల నుంచి ఒక్కసారి కూడా కూలి డబ్బులు పడలేదు. జనవరి ఆరో తేదీ నుంచి కూలీలు పనులకు వెళుతున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సుమారు వారం రోజులపాటు పనులు ఆపేశారు. అనంతరం యథావిధిగా పనులు నిర్వహిస్తున్నారు. వాస్తవంగా జనవరి మొదటి వారంలో చేసిన పనులకు మూడో వారంలో కూలి డబ్బులు అందాలి. కానీ నెల రోజులు దాటినా ఖాతాల్లో డబ్బులు పడలేదు. కోటవురట్ల మండలంలో 13,396 మందికి ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు ఉండగా వీరిలో దాదాపు సగం మంది ఉపాధి పనులకు వెళుతున్నారు. వీరికి జనవరి నుంచి ఇంతవరకు సుమారు రూ.1.65 కోట్ల వేతనాలు అందాల్సి వుంది. అధికారులను అడిగితే.. రోజు వారీ కూలీల హాజరు, చేసిన పని పరిమాణాన్ని అప్‌లోడ్ చేయడం వరకే తమ బాధ్యత అని, నిధులు విడుదల, కూలీల ఖాతాల్లో జమ చేయడం అన్నది కేంద్రం చేతిలో వుంటుందని చెబుతున్నారని కూలీలు వాపోతున్నారు. దీనిపై ఉపాధి హామీ పథకం ఏపీవో నాగరాజును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. జనవరి నుంచి కూలీలకు వేతనాలు అందని మాట వాస్తవమేనని అన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వారం రోజుల్లో కూలీల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని అన్నారని ఆయన చెప్పారు.

ఇంటి ఖర్చులకు ఇబ్బంది పడుతున్నాం



నేను, నా భార్య సంక్రాంతి తరువాత నుంచి ఉపాధి హామీ పథకం పనులకు వెళుతున్నాం. వాస్తవంగా గత నెలలో చేసిన పనులకు ఈ నెల మొదటి వారంలో డబ్బులు అందాలి. మూడు వారాలు దాటినా అతీగతీ లేదు. వేతనాలను ఇన్ని రోజులపాటు ఎందుకు చెల్లించలేదో అర్థం కావడం లేదు. కుటుంబ ఖర్చులకు ఇబ్బంది పడుతున్నాం. ఉపాధి వేతనాలను వెంటనే చెల్లించేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

- చిటికెల సత్తిబాబు, ఉపాధి కూలీ, తిమ్మాపురం

25 వేల అంకుడు మొక్కల పెంపకం

- ఏటికొప్పాక హస్త కళాకారుల కోసం ప్రభుత్వ నిర్ణయం
- ఉపాధి హామీ పథకం పీడీ పూర్ణిమాదేవి

నక్కపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి):



పూర్ణిమాదేవి

ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఎలమంచిలి క్లస్టర్ పరిధిలో 25 వేల అంకుడు మొక్కలు పెంచేందుకు ప్రణాళికలు రూపొందించామని ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.పూర్ణిమాదేవి చెప్పారు. శుక్రవారం ఆమె ఎలమంచిలి క్లస్టర్‌పరిధిలోని మండలాలకు చెందిన ఉపాధి పథకం సిబ్బందితో ప్రగతి, ప్రణాళికలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనం తరం మీడియాతో మాట్లా డుతూ, జనవరి 26వ తేదీన ఢిల్లీలో జరి గిన రిపబ్లిక్ డే పరేడ్‌లో ఏటికొప్పాక లక్కబొమ్మలతో రాష్ట్ర శకటాన్ని ప్రదర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. ఏటికొప్పాక హస్తకళాకారులు లక్కబొమ్మలు తయారు చేయడానికి అవసరమైన ముడి సరకు అంకుడు కర్ర లభించకపోవడంతో ఇబ్బందులు పడుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. హస్త కళాకారులకు అంకుడు కర్ర కొరత లేకుండా చూడాలన్న డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు ఎలమంచిలి క్లస్టర్ పరిధిలో ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా అంకుడు మొక్కలు పెంచాలని నిర్ణయించామని చెప్పారు. ఇందుకు అటవీ, రెవెన్యూ శాఖల సహకారం తీసుకుంటామని ఆమె తెలిపారు.

కాగా ఉపాధి హామీ పథకం కింద 2024-25లో జిల్లాలో కోటి 20 లక్షల పని దినాలకుగాను ఇంతవరకు కోటి 9 లక్షల పనిదినాలు కల్పించామన్నారు. ఇందుకుగాను కూలీలకు రూ.315 కోట్లు చెల్లించినట్టు చెప్పారు. ఇంకా రూ.160 కోట్లతో 1,544 సీసీ రోడ్లు, 26 తారు రోడ్లు నిర్మించామన్నారు. 2025-26లో కోటి 28 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆమె చెప్పారు.

600 కిలోల గంజాయి పట్టివేత

ఎనిమిది మంది అరెస్టు

- కారు, రెండు బైక్‌లు సీజ్
- మరో ఇద్దరి కోసం గాలింపు
- ప్రధాన నిందితుడు గుంటపల్లికి చెందిన పాత నేరస్థుడిగా గుర్తింపు
- ఏజెన్సీలో కొనుగోలు చేసి గోపాలపట్నం సమీపంలో నిల్వ
- ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు తరలింపు
- పక్కా సమాచారంతో 'పేట పోలీసులు దాడి



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో ఎస్పీ తుహిన్ సిన్హా, డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, పోలీసులు

పాయకరావుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి):

స్థానిక పోలీసులు భారీ మొత్తంలో గంజాయి పట్టుకున్నారు. మండలంలోని గోపాలపట్నం సమీపంలో సూదికొండ వద్ద గంజాయి నిల్వ చేసినట్టు సమాచారం అందుకున్న సీఐ జి.అప్పన్న.. సిబ్బందితో వెళ్లి సుమారు 600 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఎస్పీ తుహిన్ సిన్హా శుక్రవారం సాయంత్రం ఇందుకు సంబంధించిన వివరాలను ఇక్కడ మీడియాకు వెల్లడించారు.

పాయరావుపేట మండలం గుంటపల్లికి చెందిన ఒక వ్యక్తి అల్లూరి సీతారాజు జిల్లా ఏజెన్సీ నుంచి గంజాయి కొనుగోలు చేసి, ఇక్కడకు తీసుకుని ఇతర రాష్ట్రాల్లోని గంజాయి వ్యాపారులకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో కొద్దిరోజుల క్రితం ఒడిశా సరిహద్దులోని ఒక గ్రామంలో 600 కిలోల గంజాయిని

... మిగతా 8వ పేజీలో

30 వేల కిలోల గంజాయి దహనం

- ఫార్మాసిటీ సీడబ్ల్యుఎంపీలో శాస్త్రీయ పద్ధతిలో కాల్చివేత



కార్డు డంపర్‌లో గంజాయి మూట వేస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జెట్టి, ఎస్పీలు అమిత్‌బర్దర్, తుహిన్‌సిన్హా

పరవాడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) :

ఫార్మాసిటీలోని కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు (సీడబ్ల్యుఎంపీ)లో గల ఇన్సినరేషన్ ప్లాంటులో శుక్రవారం విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి నేతృత్వంలో 30 వేల కిలోల గంజాయి, 35 కేజీల హ్యాష్ ఆయిల్‌ను దహనం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసులు గత మూడేళ్లలో వేర్వేరు ప్రాంతాల్లో సుమారు 30 వేల కిలోల గంజాయి, 35 కేజీల హ్యాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిని శాస్త్రీయ పద్ధతిలో దహనం చేయాలన్న న్యాయస్థానం ఆదేశాల మేరకు ఫార్మాసిటీలోని సీడబ్ల్యుఎంపీలో శుక్రవారం ఈ ప్రక్రియ చేపట్టారు. గంజాయి మొత్తం రెండు, మూడు రోజుల్లో దహనం అవుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల ఎస్పీలు అమిత్‌బర్దర్, తుహిన్‌సిన్హా, పాడేరు అడిషనల్ ఎస్పీ కె.ధీరజ్, చింతపల్లి ఏఎస్పీ నవజ్యోత్‌సింగ్ మిశ్రా, పాడేరు, పరవాడ డీఎస్పీలు షాబాజ్ అహమ్మద్, విష్ణుస్వరూప్, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

లలిత ఫెర్రో కంపెనీకి తాళాలు



తాళం వేసిన ఫెర్రో కంపెనీ గేటు

యాజమాన్యం ఆకస్మిక చర్యతో కార్మికులు ఆందోళన

- కొద్దిసేపటికి తాళాలు తీసిన యాజమాన్య ప్రతినిధులు
- కార్మికులు లోపలికి రావద్దంటూ హుకుం
- ఒక నెల జీతం బ్యాంకు ఖాతాలకు జమ చేస్తూ మెసేజ్‌లు
- అయినా ఆందోళన విరమించని కార్మికులు
- బకాయి నెల జీతంతోపాటు మరో నెల జీతం కూడా చెల్లించాలని డిమాండ్
- కార్మిక శాఖ అధికారులతో చర్చలకు పోలీసుల హామీ
- తాత్కాలికంగా ఆందోళన విరమించిన కార్మికులు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి):

స్థానిక ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజడ్)లోని రాజరాజేశ్వరి లలితా త్రిపుర సుందరి ఫెర్రో కంపెనీ యాజమాన్యం, కార్మికుల విషయంలో రోజుకో తీరుగా వ్యవహరిస్తున్నది. ముందస్తుగా చెప్పకుండా ఉత్పత్తిని నిలిపివేయడం, కంపెనీలో పనులు లేవని చెప్పడం, వేతనాలు సక్రమంగా చెల్లించకపోవడం వంటి చర్యలకు పాల్పడుతున్నది. తాజాగా ఫ్యాక్టరీ గేటుకు తాళాలు వేసి, కార్మికులు ఆందోళనకు దిగడంతో కొద్దిసేపటికి తాళాలు తీసింది. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

ప్రత్యేక ఆర్థిక మండలిలోని రాజరాజేశ్వరి లలితా త్రిపుర సుందరి ఫెర్రో ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో సుమారు 550 ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారు. విద్యుత్ బకాయిలు పేరుకుపోవడంతో జనవరి 23వ తేదీన ఈపీడీసీఎల్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో కంపెనీలో ఉత్పత్తి నిలిచిపోయింది. పనిలేకపోవడంతో కార్మికులు ఆందోళనకు దిగారు. విద్యుత్ బకాయిలు చెల్లించి ఉత్పత్తిని పునఃప్రారంభిస్తామని యాజమాన్యం చెప్పడంతో కార్మికులు శాంతించారు. అయితే కంపెనీలో పనిచేస్తున్న ఉన్నతాధికారులు ఇక్కడ ఉద్యోగం మానేసి వేరే కంపెనీల్లో చేరుతుండడంతో కార్మికులకు అనుమానం కలిగింది. ఇదే సమయంలో ఫెర్రో ఉత్పత్తులతోపాటు ముడిసరకును యాజమాన్యం బయటకు తరలిస్తుండడంతో కార్మికులు ఆందోళనకు దిగారు. కంపెనీని మూసే ప్రసక్తే లేదని, కొంత ముడిసరకుతోపాటు ఫెర్రో ఉత్పత్తులను మాత్రమే బయటకు పంపుతున్నామని యాజమాన్యం చెప్పడంతో కార్మికులు ఆందోళన విరమించారు. రోజూ కంపెనీకి వస్తున్నప్పటికీ ఉత్పత్తిని

... మిగతా 8వ పేజీలో



కంపెనీ ముందు ఆందోళన చేస్తున్న కార్మికులు

విద్యుత్ లోడు క్రమబద్ధీకరణ

50 శాతం రాయితీ

- పంపిణీ సంస్థలకు విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశం
- మార్చి 1 నుంచి దరఖాస్తుల స్వీకారం
- జూన్ 30వ తేదీ వరకూ అవకాశం
- గృహ వినియోగదారులకు మాత్రమే...
- ప్రస్తుతం లోడుకు మించి వినియోగిస్తుండడంతో తరచూ ట్రిప్ అవుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి కీలక నిర్ణయం తీసుకుంది. తక్కువ లోడ్‌తో విద్యుత్ కనెక్షన్ తీసుకొని ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్న గృహ వినియోగదారులకు అదనపు లోడును 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించబోతోంది. ఈ మేరకు మార్చి ఒకటో తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించాలని పంపిణీ సంస్థలకు సూచించింది. పరిమిత కాలం మాత్రమే అందుబాటులో ఉండే రాయితీని అంతా ఉపయోగించుకునేలా ప్రచారం చేయాలని ఆదేశించింది.

ఏమిటీ అదనపు లోడు..?

ఇప్పుడు దాదాపు 80 శాతం ఇళ్లలో ఎయిర్ కండిషనర్లు వాడుతున్నారు. వేసవి వస్తోంది. ఒక ఏసీ ఉన్నవారు రెండోది, రెండు ఉన్నవారు మూడోది కొనడానికి యత్నిస్తున్నారు. వీటి వల్ల విద్యుత్ వినియోగం పెరుగుతుంది. సాధారణంగా గృహాలకు కనెక్షన్ తీసుకునే సమయంలో ఎంత విద్యుత్ వాడతారో బల్బులు, ట్యూబ్‌లైట్లు, ఫ్రిజ్, మిక్సర్/గ్రైండర్, వాషింగ్ మెషీన్ తదితరాలకు విద్యుత్ లోడును కిలోవాట్లలో లెక్కించి దాని ప్రకారం సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేస్తారు. అయితే కొంతమంది ఈ ఆర్థిక భారం తగ్గించుకోవడానికి దరఖాస్తులో కేవలం బల్బులు, లైట్లు, మిక్సర్ మాత్రమే చూపిస్తారు. కిలోవాట్ నుంచి రెండు కిలోవాట్లు పర్మిషన్ తీసుకుంటారు. దాంతో తక్కువ మొత్తంతో కనెక్షన్ వస్తుంది. ఇలా చేయడం వల్ల ఆ వీధిలో ఈ లెక్కల ప్రకారమే అందుకు తగిన సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తారు. వాస్తవంగా చూసుకుంటే అన్ని ఇళ్లల్లోను వాషింగ్ మెషిన్లు, గీజర్లు, ఏసీలు పనిచేస్తుంటాయి. దాంతో ఆ ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడు ఎక్కువై తరచూ ట్రిప్ కావడం, ఒక్కోసారి లోఓల్టేజీ రావడం వంటి సమస్యలు వస్తాయి.

గతంలో ఇంటింటికీ తిరిగి ఎక్కువ లోడు ఉన్నట్టయితే అపరాధ రుసుముతో అన్ని ఫీజులు వసూలు చేసేవారు. స్వచ్ఛందంగా ముందుకువస్తే అపరాధ రుసుము లేకుండా కేవలం ఫీజులే తీసుకునేవారు. అయినా చాలామంది అదనపు లోడును క్రమబద్ధీకరించుకోలేదు. ఇప్పుడు వేసవి వస్తోంది. వినియోగం పెరుగుతుంది. దానికి తగ్గట్టుగా అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలి. అందుకని గృహ వినియోగదారులు ముందుకు వచ్చి క్రమబద్ధీకరించుకునేలా డెవలప్‌మెంట్ చార్జీలలో 50 శాతం రాయితీ ఇవ్వాలని ఏపీఈఆర్‌సీ సూచించింది. మార్చి 1వ తేదీ నుంచి ఇది అమలులోకి వస్తుంది. ఆన్‌లైన్‌లో దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పుడు నగరంలో ఎక్కువ డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు, ఇళ్లు ఎక్కువయ్యాయి. ప్రతి గదికి ఏసీ, బాత్రూమ్‌లో గీజర్, కిచెన్‌లో ఓవెన్, గ్రైండర్ వంటివి ఉంటున్నాయి. ఇంకా కొందరు హాలులో కూడా ఏసీ పెట్టుకుంటున్నారు. ఇలాంటి ఇళ్లకు

... మిగతా 8వ పేజీలో

కిలోవాట్‌కు సెక్యూరిటీ డిపాజిట్ రూ.200

- డెవలప్‌మెంట్ చార్జీలు రూ.2,000... అందులో 50 శాతం రాయితీ

అదనపు విద్యుత్ లోడ్‌ను క్రమబద్ధీకరించుకునే వారి నుంచి అదనపు కిలోవాట్‌కు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200 వసూలు చేసే అవకాశం ఉంది. ఉదాహరణకు రెండు కిలోవాట్లకు కనెక్షన్ తీసుకొని ఐదు కిలోవాట్లకు క్రమబద్ధీకరించుకుంటే అదనంగా ఉన్న మూడు కిలోవాట్లకు సెక్యూరిటీ డిపాజిట్‌గా కొత్త రేట్ల ప్రకారం రూ.200 చొప్పున రూ.600 చెల్లించాల్సి ఉంటుంది. ఇక డెవలప్‌మెంట్ చార్జీలకు వస్తే ఇవి కిలోవాట్‌కు రూ.2 వేలు నిర్ణయించినట్టు సమాచారం. అందులో 50 శాతం రాయితీ లభిస్తుంది. అదనంగా మూడు కిలోవాట్లు క్రమబద్ధీకరించుకుంటే రూ.6 వేలులో 50 శాతం రాయితీ పోను రూ.3 వేలు కట్టాల్సి ఉంటుంది. అంటే మొత్తం సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్‌మెంట్ చార్జీలు కలిపి రూ.3,600 చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకం మార్చి 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు అమలులో ఉంటుంది.

ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ విజయమే లక్ష్యం కావాలి

- రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ 'ప్రగడ' పిలుపు
- టీడీపీ నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు, చిత్రంలో పప్పల చలపతిరావు

ఎలమంచిలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి మద్దతుతో బరిలో ఉన్న పాకలపాటి రఘువర్మ విజయానికి అంతా సమష్టిగా పనిచేయాలని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు టీడీపీ శ్రేణు లకు పిలుపునిచ్చారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటైన నియోజకవర్గస్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడారు. పార్టీ శ్రేణులంతా ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఏవిధంగా పనిచేశారో రఘువర్మ గెలుపునకు అదే స్ఫూర్తితో కృషి చేయాలన్నారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు బొండా జగన్నాథం మాట్లాడుతూ రఘువర్మ తరఫున విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ మధు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు, జిల్లా నాయకులు రాజాన సూర్యనాగేశ్వరరావు, పిల్లా తులసీరామ్, జిల్లా అధికార ప్రతినిధి కాండ్రకోట చిరంజీవి, పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గొర్లె నానాజీ, ఆడారి రమణబాబు, కొఠారు సాంబ, నాలుగు మండలాల అధ్యక్షులు ఇత్తంశెట్టి రాజు, దొడ్డి శ్రీను, దిన్‌బాబు, జనపరెడ్డి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా పాఠశాలల్లో ప్రచారం



పెదకలవలాపల్లి పాఠశాల వద్ద ప్రచారం నిర్వహిస్తున్న వివిధ సంఘాల నాయకులు

రాంబిల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీల్లో ఉన్న కోరెడ్ల విజయగౌరీకి తొలి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని పెదకలవలాపల్లి, లాలంకోడూరు, కొత్తపట్నం జిల్లా పరిషత్ హైస్కూళ్లలో శుక్రవారం యూటీఎఫ్, సీఐటీయూ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా మాట్లాడుతూ విద్యారంగం పరిరక్షణకు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి విజయగౌరీని గెలిపించాల్సిందిగా కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎల్లయ్యబాబు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు, సిహెచ్.శివాజీ, సిహెచ్.పద్మనాభరావు, మత్స్యకార్మిక సంఘం జిల్లా నాయకులు డి.కాశి తదితరులు పాల్గొన్నారు.

నేడు 15,16 వార్డుల్లో తాగు నీటి కుళాయిలు బంద్

ఎలమంచిలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని 15, 16 వార్డుల్లో కుళాయిల ద్వారా అందించే తాగునీటి శనివారం బంద్ చేయనున్నట్టు మునిసిపల్ అధికారులు తెలిపారు. ఎస్.రాయవరం మండలం సోముదేవునిపల్లి వాటర్ ప్రాజెక్టు వద్ద విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినందున ఈరెండు వార్డుల పరిధిలో గల నెహ్రూనగర్, ద్వారకానగర్, అగ్నిమాపక కాలనీ ప్రాంతాల్లో ఈ అసౌ కర్యం కలగనుందన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని వివరించారు.

పురాతన ఆలయం పునః ప్రారంభం

- కొత్తపేట రామలింగేశ్వర ఆలయంలో విశేష పూజలు
- భక్తిశ్రద్ధలతో శివ పార్వతుల కళ్యాణం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుందరపు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న తపోవనం స్వామిజీ, అర్చకులు (అంతర్ చిత్రం) ఆలయంలో శివలింగం

ఎలమంచిలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొత్తపేటలో రెండు శతాబ్దాల నాటి చారిత్రాత్మక రామలింగేశ్వరస్వామి ఆలయ పునః ప్రారంభోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. తపోవనం స్వామిజీ సచ్చిదానంద సరస్వతీ సమక్షంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి స్వామివారికి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్‌లతో పాటు మునిసిపాలిటీలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయం ఆవరణలో శివపార్వతుల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు భారీగా తరలి రావడంతో ఈ ప్రాంతం కోలాహలంగా మారింది. వేద పాఠశాల ప్రతినిధి పెద్దింటి సూర్యనారాయణ, చార్టెడ్ అకౌంటెంట్ బి.ఎస్.బంగారు శెట్టి, సుందరపు బాబ్జీ, పప్పు ఈశ్వరరావు, కరెడ్ల మల్లికార్జునరావులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నుంచి అంగన్‌వాడీలకు శిక్షణ తరగుతులు

రాంబిల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం రాంబిల్లి హైస్కూల్‌లో శనివారం నుంచి మూడు రోజుల పాటు అంగన్‌వాడీలకు రెండో విడత జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయని ఎంఈవోలు ఎం.సూర్యారావు, బి.సూర్యనారాయణలు తెలిపారు. ఐదేళ్లలోపు చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ఈ తరగతులు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లలకు ఆట పాటలతో విద్యనేర్పే విధానంలో మెళకువలు తెలియజేయడంతో పాటు అభ్యాసన నైపుణాలు పెంపొందించడంపై శిక్షకులు సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. వివిధ కేంద్రాల నుంచి యాభై మంది అంగన్‌వాడీలు హాజరు కానున్నారు.

నేడు 12 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో 12 గ్రామాల్లో శనివారం అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలి పారు. అచ్యుతాపురం సెక్షన్ పరిధిలో కొత్త విద్యుత్ లైన్లు వేస్తున్నందున వెదురువాడ, గొర్లె ధర్మవరం, లంక ధర్మవరం, మెట్ట ధర్మవరం, మోసయ్యపేట బర్మాకాలనీ, అచ్యుతాపురం ఇందిరమ్మ కాలనీ, ఆర్ఆర్ కాలనీ, దిబ్బపాలెం, వెంకటాపురం సెంటర్, మార్టూరు రోడ్, అచ్యుతాపురం జంక్షన్, సాయిప్రియ లే అవుట్‌లకు ఉదయం పదినుంచి సాయంత్రం ఐదు గంటలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మునగపాక మండలంలో...

మునగపాక : ఇక్కడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఆ శాఖ ఏఈ గోపి తెలిపారు. సబ్‌స్టేషన్‌లో స్వల్ప మరమ్మతు పనుల కారణంగా ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మునగపాక, అరబుపాలెం, తిమ్మరాజుపేట, పాటిపల్లి, వాడ్రాపల్లి, నాగవరం, కె.నాగవరం, రాజుపేట, గొల్లలపాలెం, ఒంపోలు, నాగులాపల్లి, ఉమ్మలాడ గ్రామాల్లో ఈ అసౌకర్య కలగనుందన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



చిత్రలేఖనంలో వేసిన చిత్రాలు చూపుతున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జంపపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శాస్త్రి మాతృభాష ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. మాతృభాష పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు బొడ్డేటి సత్యనారాయణ, పి.శ్రీనివాస్, రమణ, అప్పలనాయుడు, కృష్ణారావు, సుధాకర్, వెంకట శివ, సత్యనారాయణ, చిట్టిరాజు, షబ్బీర్, సుబ్బారావు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులు పారిశ్రామిక పర్యటన



డైట్ కళాశాల ఆవరణలో పాటిపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు

మునగపాక, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పాటిపల్లి గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు పారిశ్రామిక పర్యటన చేశారు. మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఒకేషనల్ కోర్సు చేస్తున్న 63 మంది అనకాపల్లిలో డైట్ కళాశాలకు వెళ్లి అక్కడున్న ఈసీ, ఎస్‌ఈ, ఈఈఈ విభాగాలకు చెందిన పరిశోధన కేం ద్రాలను సందర్శించి అవగాహన పొందినట్టు ఆ పాఠశాల ఉపాధ్యాయిని పీలా ఆషా తెలిపారు. పారిశ్రామిక పర్యటన మంచి అనుభూతిని ఇచ్చిందని విద్యార్థులు వివరించారు.

ఎమ్మార్సీ భవనంలో భయం..భయంగా విధులు

- శిథిలావస్థకు చేరడంతో ఊడి పడుతున్న శ్లాబ్ పెచ్చులు
- సమావేశాలకు హాజరవుతున్న ఉపాధ్యాయుల్లో ఆందోళన
- వర్షాకాలంలో గదుల్లోకి నీరు చేరుతుండడంతో అవస్థలు



రాంబిల్లిలో శిథిలావస్థకు చేరిన ఎమ్మార్సీ భవనం

రాంబిల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం రాంబిల్లిలో గల మండల రిసోర్స్ సెంటర్ (ఎమ్మార్సీ) భవనం శిథిల స్థితికి చేరుకుంది. 2002లో సుమారు మూడు లక్షల రూపాయల నిధులు వెచ్చించి ఈ భవనాన్ని నిర్మించారు. అప్పటి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ప్రస్తుతం ఈ భవనం శిథిల స్థితికి చేరుకుంది. శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. దీంతో సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ప్రతిరోజూ వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు భవనానికి వస్తుంటారు. ఇందులోనే ఉపాధ్యాయుల సమావేశాలు తరచూ నిర్వహిస్తుంటారు. దీంతో ఎప్పుడు ఎవరిపై శ్లాబ్ పెచ్చులూడి పడతాయోనని వారంతా భయాందోళన చెందుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు ఆ నీరు గదుల్లోకి చేరుతున్నట్టు చెపుతున్నారు. విలువైన పుస్తకాలు, కంప్యూటర్లు తడిసి పాడవుతున్నాయని వాపోతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి, నిధులు మంజూరు చేసి మరమ్మతులు పనులు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.

జాతీయ స్థాయి చిత్రకళ పోటీల్లో నాతవరం విద్యార్థుల ప్రతిభ

నాతవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో జరిగిన చిత్రకళ పోటీల్లో నాతవరం మండలం డి.యర్రవరం స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఫిబ్రవరి 18, 19, 20 తేదిల్లో గుంటూరులో జరిగిన జాతీయస్థాయి చిత్రకళ ఈ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చి బంగారు, వెండి పతకాలను సాధించినట్టు కరస్పాండెంటెండ్ ఎ.గిరిబాబు తెలిపారు. శుక్రవారం పతకాలు సాధించిన విద్యార్థులు ఆనందిని, ఆకార్, శశింక, శ్రీనివాసు తదితరులను అభినందించారు.



ఉపాధి సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న పీడీ పూర్ణిమ

రైతులకు ఉపయోగపడే పనులు చేయాలి

ఉపాధి ప్రగతి సమీక్షలో ఎన్ఆర్ఈజీఎస్ పీడీ పూర్ణిమాదేవి

నక్కపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని ఎన్ఆర్ఈజీఎస్ పీడీ ఆర్.పూర్ణిమాదేవి సూచించారు. మండల కేంద్రంలో పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలకు చెందిన ఉపాధి పథకం సిబ్బందితో ప్రగతి, ప్రణాళికలపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే విధంగా ఒక్కో పంచాయతీలో చెరువు పనులు చేయించాలని సూచించారు. ఇళ్ల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణం జరగాలని చెప్పారు. ప్రభుత్వ భూముల్లో అంకుడు మొక్కలను నాటాలని సూచించారు. ఉపాధి పథకం కూలీలకు రోజుకు కనీసం రూ.300 వేతనం వచ్చేలా పనులు చేయాలని సూచించారు. పర్యావరణ, పరిరక్షణ కోసం పంట కాలువ గట్లపై మొక్కలు, నాటాలన్నారు. ఈ సమావేశంలో ఏపీడీ ఎరకయ్య, క్లస్టర్ పరిధిలోని ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మాఢవీధుల్లో చురుగ్గా రోడ్ల నిర్మాణాలు



మాఢ వీధుల్లో శరవేగంగా సాగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులు

నక్కపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉపమాక క్షేత్రంలో స్వామివారి తిరువీధి సేవలు, ఉత్సవాలు జరిగే మాఢవీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ వీధుల్లో తిరువీధి సేవలు, రథోత్సవం జరిగేటప్పుడు ఇబ్బందులు కలుగుతున్నాయని, మాఢవీధుల్లో రోడ్లు దెబ్బతిన్నాయని ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి హోం మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సిఫారసు మేరకు సుమారు రూ.30 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి హెటిరో యాజమాన్యం ముందుకొచ్చింది. ప్రస్తుతం రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వారం రోజుల్లోగా ఈ పనులు పూర్తవుతాయని ఆలయ మాజీ చైర్మన్ బుజ్జి చెప్పారు.

పుంత రోడ్డులో ఆక్రమణలు తొలగించాలి

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఎల్.పురం గ్రామంలో పుంతరోడ్డు ఆక్రమణను తొలగించాలని సర్పంచ్ పడాల సోమన్నదొర డిమాండ్ చేశారు. శుక్రవారం ఆక్రమణకు గురైన పుంతరోడ్డును విలేకరులకు చూపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుంత రోడ్డు, పీఎల్.పురంలో ప్రభుత్వం వేసిన జగనన్న లేఅవుట్‌కు జాతీయ రహదారి నుంచి వెళ్లేందుకు దగ్గర దారి అవుతుందన్నారు. ప్రస్తుతం ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీ నిధులతో రోడ్డు వేస్తున్నట్టు చెప్పారు. పుంత రోడ్డు ఆక్రమణను అధికారులు తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

'పేట'లో యథేచ్ఛగా ఆక్రమణలు

ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు ఆక్రమించి బడ్డీల ఏర్పాటు

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం.. పట్టించుకోని అధికార గణం



ఆర్టీసీ బస్టాండులో నుంచి బయటకు వచ్చే రోడ్డుపై ఏర్పాటు చేసిన బడ్డీలు

పాయకరావుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నుంచి బస్సులు బయటకు వచ్చే మార్గంలో రహదారిని ఆక్రమించి మరీ బడ్డీలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. అయినప్పటికీ పట్టించుకునే నాథులే లేక పట్టణంలో చిన్న ఖాళీ స్థలం కనపడినా ఆక్రమణకు గురవుతోంది. ఫలితంగా పాయకరావుపేట పట్టణంలో తాండవ వంతెన నుంచి వైజంక్షన్ వరకు సుమారు 100 అడుగుల వెడల్పు ఉండాల్సిన మెయిన్ రోడ్డు ఇరుకుగా మారిపోయి, నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్న విషయం కూడా తెలిసిందే.

పట్టణంలో గౌతమ్ థియేటర్ ఎదురుగా మెయిన్‌రోడ్డును ఆనుకుని ఆర్టీసీ బస్టాండు కోసం మొదట్లో ప్రభుత్వం 50 సెంట్లు కేటాయించగా, అనంతర కాలంలో ఆక్రమణల కారణంగా ప్రస్తుతం ఆర్టీసీ ఆధీనంలో 30 సెంట్లు కూడా లేదు. పైగా ఆర్టీసీ బస్టాండులోకి, బయటకు వచ్చేందుకు ఏర్పాటుచేసిన రోడ్లను ఆనుకుని ఉన్న షాపుల యజమానులు తమ షాపులకు ఎదురుగా షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా రోడ్డును కొద్దికొద్దిగా ఆక్రమిస్తుండగా బస్టాండు ఆవరణలో ఆటోలు, ఇతర వాహనాలు నిలుపుతుండడంతో ఆర్టీసీ బస్సులు బస్టాండులోకి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇది చాలదన్నట్టు కొద్ది రోజుల క్రితం బస్టాండ్‌లో నుంచి బస్సులు బయటకు వచ్చే రోడ్డును ఆక్రమంచి కొత్తగా బడ్డీ ఏర్పాటు చేశారు. ఈ బడ్డీలో వ్యాపారం ప్రారంభిస్తే కొనుగోలుదారులు పూర్తిగా రోడ్డుపైనే నిలబడే అవకాశం ఉన్నందున ఆర్టీసీ సర్వీసులకు మరిన్ని ఇబ్బందులు తప్పవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్టీసీ బస్టాండు రోడ్డు ఆక్రమణలు తొలగించాలని పట్టణ ప్రజలు, వాహన చోదకులు విజ్ఞప్తి చేశారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు

- శ్లాబ్ దశలో నిలిచిపోయిన ఆరు కేంద్రాల భవనాలు
- కొన్నేళ్లుగా ముందుకుసాగని పనులు



పాల్మన్‌పేటలో అసంపూర్తిగా నిలిచిన భవనం... ఈదటంలో నిలిచిన భవనం చుట్టూ పేరుకుపోయిన తుప్పలు

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రధానంగా ఈదటం, పాయకరావుపేట ఇందిరా కాలనీ, పాల్మన్ పేట, కొర్లయ్యపేట గ్రామాల్లో ఆరు కేంద్రాల భవనాలు శ్లాబు దశలో ఉండిపోయాయి. వీటి పనులు కొన్నేళ్లుగా ముందుకు సాగడం లేదు.

2014-2019 టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.10 లక్షల ఉపాధి పథకం నిధులతో అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మించడానికి నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో అప్పుడే నిర్మాణాలను ప్రారంభించారు. చివరి దశకు వచ్చేటప్పటికి నిధులు చాలకపోవడంతో భవనాలను అసంపూర్తిగా వదిలేశారు. నాటి నుంచి ఆ భవనాలు అలాగే ఉండిపోయాయి. ఈ భవనాలు చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి. దశాబ్ద కాలం గడుస్తున్నా ఈ భవనాల పనులు ముందుకు సాగడం లేదు. ఈ భవనాలను పూర్తి చేయడానికి సుమారు మరో రూ.5 లక్షలు నిధులు విడుదలైనా నిర్మించడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని పంచాయతీరాజ్, ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ కేంద్రాలను అద్దె భవనాలలో నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకునే పాపానికి పోవడం లేదు. ఇప్పటికైనా భవన నిర్మాణాలను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకు రావాలని, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. లేకపోతే ఇవి అసాంఘిక కార్యకలాపాలకు అనువుగా మారిపోతాయని వారు పేర్కొన్నారు.

పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం



కె.వెంకటాపురంలో తెలుగు భాష గొప్పతనాన్ని వివరిస్తున్న ఉపాధ్యాయులు

కోటవురట్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కె.వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అల్లావుద్దీన్ మాట్లాడుతూ తెలుగు భాషపై పట్టు సాధిస్తే మిగతా అన్ని భాషల బోధనకు సులువుగా ఉంటుందన్నారు. తెలుగు భాషలోని తియ్యదనాన్ని భవిష్యత్తు తరాలకు అందించి మాతృభాషను కాపాడుకుందామని విద్యార్థులకు ఆయన సూచించారు. చిన్నతరంలోనే ఆంగ్ల భాషలో విద్యనందిస్తూనే మాతృభాషపై వారికి అవగాహన కల్పించాలన్నారు. ఇంట్లో పిల్లలకు తెలుగులోనే మాట్లాడడం, పుస్తకాలు చదవడాన్ని తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ, అప్పారావు, ప్రసాద్, సతీశ్, క్రాంతికిరణ్ పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్. రాయవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొరుప్రోలు, ఎస్.రాయవరం, ధర్మవరం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్, విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు తొలగింపు పనుల్లో భాగంగా ఎస్.రాయవరం సెక్షన్ 11 కేవీ, ఆర్‌డబ్ల్యూఎస్ ధర్మవరం 11 కేవీ, పి.ధర్మవరం రూరల్ ఫీడర్‌లో శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. అలాగే ఎస్.రాయవరం ఎంహెచ్‌క్యూ ఫీడర్‌లో ఎస్.రావరం పంచాయతీతో పాటు వాకపాడు, వెంకటాపురం, సర్వసిద్ధి, సైతారుపేట ఆక్వా ప్రదేశాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు, వమ్మవరం 11 కేవీ ఫీడర్‌లో గెడ్డపాలెం, వమ్మవరం, అగ్రహారం ఈటీసీ గ్రామాల్లో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు, రేవుపోలవరం 11 కేవీ ఫీడర్‌లో రేవుపోలవరం, చినఉప్పలం, బంగారమ్మపాలెం గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆయన చెప్పారు. ఆయా గ్రామాల వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఈఈ కోరారు.

విద్యార్థులకు బ్యాగుల వితరణ

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 3, 4, 5 తరగతుల విద్యార్థులకు విజన్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను వితరణగా సమకూర్చారు. వీటిని శనివారం స్థానిక ఉప సర్పంచ్ కలిగట్ల మాణిక్యం చేతుల మీదగా విద్యార్థులకు పంపిణీ చేశారు. పెనుగొల్లు, ధర్మవరం అగ్రహారం గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు యుద్ధండం సూర్యనారాయణ, కర్రి శ్రీను కృషితో విజన్ వలంటరీ ఆర్గనైజేషన్ ముందుకు వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ ప్రతినిధి పాలపర్తి వరహాలరావు, హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలను వినియోగించుకోవాలి

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగించుకోవాలని ఈవోపీఆర్డీ సిహెచ్.చంద్రశేఖరరావు సూచించారు. మండలంలోని సత్యవరం గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రహదారులపై ఉన్న చెత్తాచెదారాలను తొలగించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల వద్ద ఉన్న నాడెప్ తొట్టెలను వినియోగించాలని చెప్పారు. తడిపొడి చెత్తపై ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శి, సిబ్బందికి ఆయన ఆదేశించారు. ప్రజలు నిర్దేశిత ప్రదేశాలలో చెత్త వేసేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలలో తయారైన వర్మీ కంపోస్టును రైతులకు విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాయుడు, సర్పంచ్ సఖిలేటి రాము, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సమష్టి కృషి

▸▸ పరవాడ మండల సమావేశంలో ఎంపీపీ వెంకట పద్మలక్ష్మి వెల్లడి

▸▸ సమస్యలను సభ దృష్టికి తీసుకు వచ్చిన సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి

పరవాడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : అధికారులు, ప్రజా ప్రతినిధుల సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, ఈ దిశగా అందరం కృషి చేద్దామని ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి అన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో కె.ధర్మారావు అధ్యక్షతన శుక్రవారం ఇక్కడ ఏర్పాటైన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి విషయంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌ల సూచనలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. పరవాడ పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాయిరాం మాట్లాడుతూ రోగులకు అవసరమయ్యే మందులన్నీ అందుబాటులో ఉన్నాయన్నారు. కుక్క, పాము కాట్లకు సంబంధించిన వ్యాక్సిన్ కూడా సరిపడినంత ఉందని వివరించారు. పరవాడ ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు మాట్లాడుతూ గొర్లెవానిపాలెం పంచాయతీ పరిధిలో గల జేఎన్ఎన్‌యుఆర్‌ఎం కాలనీకి శ్మశానవాటిక లేకపోవడం వలన అక్కడ మృతదేహాలకు పర వాడ బీసీ కాలనీకి చెందిన శ్మశానవాటికలో దహన సంస్కారాలు చేస్తున్నారని వివరించారు. ఈ కారణంగా కాలనీవాసులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోయారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీకి శ్మశానవాటిక స్థలం కేటాయించాలని కోరారు. దీనిపై తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్ మాట్లాడుతూ తొందర్లోనే వారికి శ్మశానవాటిక కోసం స్థలాన్ని కేటాయిస్తామని వెల్లడించారు. పరవాడకు ఇప్పటి వరకు ఒక్క గోకులం షెడ్ కూడా మంజూరు కాకపోవడానికి కారణం చెప్పాలని సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు సమావేశంలో ప్రస్తావించారు. మండలానికి ఇప్పటి వరకు 23 గోకులం షెడ్లు మంజూరయ్యాయని మరో 27 షెడ్లు మంజూరు కావాల్సి ఉందని వెటర్నరీ ఏడీ రామకృష్ణ సమాధానమిచ్చారు. దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ షెడ్లు మంజూరవుతాయని స్పష్టం చేశారు. మండల వ్యవసాయాధికారిణి చంద్రావతి మాట్లాడుతూ ఈ నెల 25నాటికి రైతులంతా ఫార్మా రిజిస్ట్రీ చేయించుకోవాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యల్లో భాగంగా మార్చి 10 నుంచి ఏప్రిల్ 9 వరకు మంచినీటి పథకాల పరికరాలకు మరమ్మతు పనులు చేపట్టడం జరుగుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ షణ్ముఖ తెలిపారు. హౌసింగ్ లేఅవుట్‌కు సంబంధించిన సమస్య నేటికీ పరిష్కారం కాలేదని, ఫారెస్ట్ అధికారులు జాయింట్ సర్వేకు సహకరించడం లేదని రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు సభ దృష్టికి తీసుకు వచ్చారు. సర్వేకు సహకరించకపోవడంపై తహసీల్దార్ అసహనం వ్యక్తం చేశారు. అటవీ అధికారులకు తక్షణమే నోటీసులు జారీ చేస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ బందం నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ పాల్గొన్నారు.

సమస్యలపై బ్యాంక్ ఉద్యోగులు నిరసన


నిరసన తెలియజేస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మెయిన్ రోడ్డులో గల యూనియన్ బ్యాంక్ వద్ద శుక్రవారం ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంకుల్లో నియామకాలు చేపట్టాలని, తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, వారంలో ఐదు రోజులు పనిదినాలు కల్పించాలని, ఔట్ సోర్సింగ్ నియామకాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ యూనియన్ బ్యాంక్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కాండ్రేగుల హరికృష్ణ ఆధ్వర్యంలో ఈ ఆందోళనను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 24, 25 తేదీల్లో బ్యాంకు ఉద్యోగులు రెండు రోజులు దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది శ్రీదేవి శిరీషా, రాజశ్రీ, ఏవీజే రాజు, ఆడారి రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఆర్డీవోపై చర్యలకు జర్నలిస్టుల వినతి

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఆర్డీవో శ్రీలేఖపై ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ఏపీయూడబ్ల్యూజే అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు పెంటకోట జోగినాయుడు కోరారు. ఈ మేరకు యూనియన్ నాయకులు శుక్రవారం ఇక్కడ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆర్డీవో శ్రీలేఖ అక్రమాలపై 'లీడర్' పత్రికలో వరుస కథనాలు ప్రచురితం కావడంతో ఆమె కక్షపూరితంగా వ్యవహరిస్తూ, వారెంట్ నోటీసులు ఇచ్చారని వివరించారు. ప్రజలు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా వ్యవహరిస్తున్న పత్రికలు ప్రజా సమస్యలు, అక్రమాలు, అన్యాయాలపై వార్తలు రాయడం సహజమన్నారు. ఆర్డీవో శ్రీలేఖ కనీసం కలెక్టర్ అనుమతి లేకుండా నోటీసుల్లో వివిధ కారణాల్ని చూపిస్తూ పత్రికను మూసేస్తామనే స్థాయిలో బెదిరింపులకు పాల్పడడం దారుణమన్నారు. వెంటనే ఆమెపై చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీయూడబ్ల్యూజే కార్యదర్శి చంద్రరావు, సభ్యులు భాస్కరరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మామిడివాక గెడ్డలో చెత్త తొలగించకుంటే ఆందోళన


మామిడివాక గెడ్డను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

కశింకోట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ తాళ్లపాలెంలోని మామిడివాక గెడ్డను పంచాయతీ అధికారులు డంపింగ్ యార్డుగా ఉపయోగిస్తుండడం తగదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు అన్నారు. శుక్రవారం ఆ పార్టీ ప్రతినిధులతో కలిసి గెడ్డలో వేసిన చెత్త, చెదారాన్ని పరిశీలించారు. పంచాయతీ చెత్త, వ్యర్థాలు, ఆసుపత్రుల్లో వాడిన వేస్టేజీని మామిడివాక గెడ్డలో వేస్తుండడం వల్ల నీరు కాలుషితమవుతుందన్నారు. పశువులు ఆ నీరు తాగి అనారోగ్యం బారినపడే ప్రమాదముందని పేర్కొన్నారు. స్వచ్ఛభారత్- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు ప్రచారానికే పరిమితమయ్యాయని విమర్శించారు. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి మామిడివాక గెడ్డలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించాల్సిందిగా కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.ఎస్.సన్యాసిరావు, వియ్యపు రాజు, బి.బాబ్జి, నాగ అప్పారావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలకు నిప్పుతో జనం అవస్థలు

పరవాడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలోని కొత్త కాలనీ సమీపంలో గల క్వారీ గుంతల్లో వ్యర్థాలను డంప్ చేసి నిప్పు పెట్టడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. గత కొంతకాలంగా రాత్రి వేళల్లో ఫార్మా వ్యర్థాలను డంప్ చేసి తగులబెడుతున్నారు. ఇటీవల కాలంలో ఇది మరింత అధికమైంది. శుక్రవారం తెల్లవారు జామున వ్యర్థాలను డంప్ చేసి నిప్పు పెట్టడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. దీనికితోడు దట్టమైన పొగ వ్యాపించడంతో భరించలేని దుర్వాసన వెదజల్లింది. ఈ కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా సంపద కేంద్రాల నిర్వహణ

▸▸ డీపీవో శిరీషారాణి వెల్లడి

▸▸ తుమ్మపాలలో కేంద్రం పునః ప్రారంభం


తుమ్మపాలలో సంపద కేంద్రం పునః ప్రారంభోత్సవంలో అధికారులు, క్లాప్ మిత్రాలు

తుమ్మపాల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : సంపద కేంద్రాల నిర్వహణను ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నట్టు జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి తెలిపారు. అనకాపల్లి మండలం తుమ్మపాలలో నిర్మించిన సంపద కేంద్రాన్ని శుక్రవారం అధికారులతో కలిసి ఆమె పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న సంపద కేంద్రాలు పక్కాగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో చెత్త సమస్యను పరిష్కరించి, పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చాలన్న లక్ష్యంతో ఉన్నట్టు చెప్పారు. ఇంటి వద్దకు వస్తున్న పారిశుధ్య సిబ్బందికి ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని సూచించారు. స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అంతకుముందు క్లాప్ మిత్రాలు, పంచాయతీ కార్యదర్శులకు సంపద కేంద్రాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంపద కేంద్రాల జిల్లా కో-ఆర్డినేటర్ ఏలూరి నాగలక్ష్మి, ఎంపీడీవో కె.వి.నరసింహారావు, ఈవోపీఆర్‌డీ వీవీఎస్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు ఈశ్వరరావు, లత, లక్ష్మి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

పేపర్‌మిల్లు ఎదుట సోమినాయుడుపాలెం గ్రామస్థుల ఆందోళన

▸▸ వ్యర్థ జలాలు గ్రామ రహదారికి ఆనుకొని ఉన్న కాలువలోకి విడిచిపెడుతున్నారని ఆరోపణ


పరిశ్రమ ఎదుట ఆందోళన చేపడుతున్న గ్రామస్థులు

పరవాడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సింహాద్రి పేపర్‌మిల్లు పరిశ్రమ ఎదుట రావాడ శివారు సోమినాయుడుపాలెం గ్రామస్థులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థ జలాలు సోమినాయుడుపాలేనికి వెళ్లే రహదారికి ఆనుకొని ఉన్న కాలువలోకి విడిచిపెట్టడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోందని, ఈ కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాని వారంతా మండిపడ్డారు. తక్షణమే పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో కె.ధర్మారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, కూండ్రపు శ్రీనివాసరావు, బండారు అప్పలనాయుడు, కె.అప్పలనాయుడు, సిరపు సన్నిబాబు, కె.నాయుడు, అప్పారావు, కనకారావు, కృష్ణ, యర్రయ్యమ్మ, వర్ధిని, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించండి

▸▸ డీఎంహెచ్‌వో రవికుమార్


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవికుమార్

సబ్బవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రోగులకు మెరుగైన వైద్య సేవలం దించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పడాల రవికుమార్ సూచించారు. మండలంలోని గుల్లేపల్లి పీహెచ్‌సీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించి, ఆసుపత్రిలో ప్రసవాలు, లేబొరేటరీ సేవలు, మందుల స్టాక్ రిజిస్టర్ తదితరాలపై తెలుసుకున్నారు. వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్య సేవలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్‌సీడీసీ సర్వే, ఎల్‌సీడీసీ సర్వే గురించి వైద్యాధికారిణి డాక్టర్ డి.దమయంతి ఆయనకు వివరించారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని స్థానిక మెయిన్‌రోడ్డులోని వన్ వే జంక్షన్‌లో గల తెలుగుతల్లి విగ్రహం వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుతల్లి విగ్రహానికి సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం పూలమాల వేశారు. అనంతరం జీవీఎంసీ గవరపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులకు దేశభాషలందు తెలుగు లెస్సా అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేష్‌గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, పిరాట్ల నరసింహమూర్తిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా విద్యాలయాల్లో ప్రచారం


విద్యా సంస్థల్లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాగజగదీశ్వరరావు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మను గెలిపించాలంటూ కూటమి నాయకులు విద్యా సంస్థల్లో ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు, అనకాపల్లి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు గోవిందరావు శుక్రవారం గాంధీనగరం జీవీఎంసీ హైస్కూల్, బాలికోన్నత పాఠశాల, భీమునిగుమ్మం హైస్కూల్, గవరపాలెం హైస్కూల్‌లలో ఉపాధ్యాయులను కలిసి మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బుద్ద మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలకు కూటమి ఇచ్చిన హామీల అమలుకు విద్యాశాఖ మంత్రి లోకేశ్ చర్యలు చేపట్టారన్నారు. టీడీపీ నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, బోడి వెంకటరావు, కుప్పిలి జగన్మోహన్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మ గెలుపునకు ఉపాధ్యాయులు కృషి చేయాల్సిందిగా గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర కోరారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, బాలుర హైస్కూళ్లలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు వేగి గోపీకృష్ణ, పెదపాటి కళ్యాణి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు ఆళ్ల శ్రీను, ఎన్.శ్రీను, వేగి సాయి, ఆకుల నానాజీ, ఎస్.భానుచందర్, జొన్నాడ సురేష్‌పాల్గొన్నారు.

శ్రీనివాసులనాయుడుకు మద్దతుగా...

సబ్బవరం : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అనుబంధ సంఘాల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న గాదె శ్రీనివాసులనాయుడును గెలిపించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ పెద్దినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ విశ్వేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆరిపాక, రావులమ్మపాలెం, మలునాయుడుపాలెం, తవ్వవానిపాలెం, నంగినార పాడు జడ్పీ హైస్కూళ్లు, కేజీబీవీ, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఉపాధ్యాయులను కలిసి ఓటును వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సత్యంనాయుడు, బోలెం సూర్యనారాయణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్, అధ్యక్షులు అప్పలనాయుడు, గోవింద, ఆర్సి గోవింద, అశోక్, శ్రీను, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠ


ఎసిరసపల్లిలో స్వామికి ఎమ్మెల్యే రమేష్ పూజలు

సబ్బవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్లుప్పి గ్రామంలో వీరాంజనేయ, బంగారమ్మపాలెం శివారు ఎ.సిరసపల్లిలో అభయాంజనేయ విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సిరసపల్లి అభయాంజనేయస్వామిని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో సర్పంచ్ దాడి లావణ్య, గ్రామ పెద్దలు దొడ్డి ప్రకాశ్, దాడి కన్నంనాయుడు, పాపాన ఎల్లాజీ, డీలర్ ఎల్లాజీ, ఉగ్గిన గంగునాయుడు, విరోతి ఉదయ్‌కుమార్, కూటమి నాయకులు బుచ్చిరాజు, బలిరెడ్డి అప్పారావు, కాజుకోటి, వెంకట్, కాళ్ల శ్రీను, చినరాజు తదితరులు పాల్గొన్నారు.

అసకపల్లి ఆలయంలో పసిడి కలశ స్థాపన

ఇదిలావుంటే, అసకపల్లి గ్రామంలో గణపతి, నాగబంధన సుబ్రహ్మణ్య నవగ్రహ సహిత ఆలయంలో పసిడి కలశ స్థాపనను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాపుశెట్టి శేషుబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా తొలుత విశేష పూజలు జరిపారు. మాజీ సర్పంచ్ కాపుశెట్టి దేముడమ్మ, నీలమణి, వైసీపీ నాయకులు గండి రవికుమార్, కర్రిబాబు, దెడ్డం ప్రసాదరావు, ఉప సర్పంచ్ సురేశ్ తదితరులు స్వామివార్లను దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవ


ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గౌరీ పంచాయతన ఆలయంలో శుక్రవారం రాత్రి గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, పొందూరు సూర్యనారాయణ శాస్త్రి, శేష, సాయిల వేదమంత్రాల మధ్య మళ్ల అప్పారావు, రవిరాజు, అరుణ దంపతులు గౌరీ పరమేశ్వరుల ఊంజల్‌సేవను నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మడకపాలెంలో జువ్వాలమ్మ ఆలయ వార్షికోత్సవం



లంకెలపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పరవాడ మండలం కన్నూరు శివారు మడకపాలెం గ్రామ ప్రజల ఆరాధ్య దేవతజువ్వాలమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి తొలుత విశేష అలంకరణలు చేపట్టిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావడంతో కోలాహల వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో భాగంగా అమ్మవారికి గ్రామ మహిళలు వివిధ రకాల పిండి వంటలతో సారెను సమర్పించారు. సాయంత్రం ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కమిటీ ప్రతినిధులు మడక రమణ, సేనాపతి కనకారావు, శ్రీనివాసరావు, బల్ల అప్పారావు, సేనాపతి మల్లికార్జునరావు, రాజు, రమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నూకాంబిక ఆలయానికి నిధులు మంజూరుపై హర్షం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయానికి టీటీడీ నుంచి నిధులు అందేలా సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు టీడీపీ నాయకుడు దాడి జయవీర్ కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ అప్పటి అనకాపల్లి ఎమ్మెల్యే పీలా గోవింద ఆహ్వానం మేరకు సీఎం చంద్రబాబు నూకాంబిక అమ్మవారిని దర్శించుకోగా ఆలయ అభివృద్ధిలో భాగంగా ఆలయానికి ఎదురుగా ఉన్న స్థలాల సేకరణకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారన్నారు. అనంతర పరిణామాలను వివరించారు.

విధులకు గైర్హాజరవుతున్న ఉపాధ్యాయులపై ఫిర్యాదు


తహసీల్దార్ రామకృష్ణకి వినతి పత్రం అందజేస్తున్న తల్లిదండ్రులు

సీలేరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులకు గైర్హాజరవుతున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. శుక్రవారం వీరు గూడెంకొత్తవీధి మండల కేంద్రానికి వెళ్లి తహసీల్దార్ రామకృష్ణకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు తరచూ విధులకు హాజరుకావడంలేదన్నారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యా సంవత్సరం పూర్తవుతున్నా విద్యార్థులకు సిలబస్ పూర్తి కావడం లేదన్నారు. విద్యార్థులు మొక్కుబడిగా పాఠశాలకు వెళ్లడం తప్పా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించే పరిస్థితిలేదన్నారు. ఇకనైనా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు స్పందించి విద్యార్థులకు సక్రమంగా విద్య అందించేలా కృషి చేయాలని కోరారు.

క్షయ నియంత్రణ సాధ్యమే


పెదవలసలో ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): క్షయను సకాలంలో గుర్తిస్తే వ్యాధిని నియంత్రించడం సులభమని పెదవలస పీహెచ్‌సీ వైద్యాధికారి కోమలి అన్నారు. శుక్రవారం క్షయ నివారణ వారోత్సవాల్లో భాగంగా గ్రామంలోని వారపు సంతలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రజలు క్షయపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రెండు వారాపాటు దగ్గు, జ్వరం ఉంటే క్షయ లక్షణంగా గుర్తించి బాధితులు పీహెచ్‌సీకి వచ్చి కళ్లె పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగితే క్రమంగా మందులు వాడాలన్నారు. పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసురావు, క్షయ సూపర్‌వైజర్ అశోక్, ఎస్టీఎల్ఎస్ వెంకట్, హెచ్‌వీ దేవమణి,ఏఎన్ఎంలు మంగ, వరలక్ష్మి, ఎంఎల్ హెచ్‌పీలు అనీష, సంతోషి పాల్గొన్నారు.

జోరుగా రబీ సాగు


వరి నారు తీస్తున్న నందివలస రైతులు

హుకుంపేట ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి); మండలంలో పలు గ్రామాల్లో రబీలో వరి సాగు పనులకు జోరందుకున్నాయి. రంగశీల పంచాయతీ నాందివలస, టిటివలస, బల్లోర్ద గ్రామాల్లో దమ్ములు పూర్తి చేస్తున్నారు. వరినారు తీసి ఉబాలకు సిద్ధమవుతున్నారు. ఈ గ్రామాల్లో వేసవిలోనూ నీటి సదుపాయం ఉండడంతో సాగుచేస్తున్నారు. ఏటా ఈ సీజన్‌లో దిగుబడులు ఆశాజనంగా ఉంటాయని చెబుతున్నారు. జూన్, జూలైలలో భారీ వర్షాలతో ఉడుపులు చేసినా, వరద నీటి వల్ల పంట దిగుబడి అంతగా ఉండని చెబుతున్నారు.

వేసవికి ముందే దాహం కేకలు

- గోమంగి పంచాయతీ పరిధి గ్రామాల్లో తాగునీటి ఎద్దడి
- గ్రావిటీ పథకానికి అందని భూగర్భ జలాలు
- నిరుపయోగంగా బోర్లు
- సమస్య తీర్చాలని ప్రజలు వేడుకోలు


రెండు కిలోమీటర్ల దూరం నుంచి నీటిని మోసుకుస్తున్న గోమంగి మహిళలు


నిరుపయోగంగా మూలకుచేరిన బోరు

పెదబయలు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోమంగి పంచాయతీ పరిధి సంతవీధి, సరియపల్లి గ్రామాల్లో గత పది రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. ఈ గ్రామాలకు గ్రావిటీ పథకం ద్వారా నీటి సరఫరా జరిగేది. ప్రస్తుత ఎండల ప్రభావానికి ఊట ఇంకిపోవడంతో ఈ పథకం నుంచి చుక్క నీరు రావడంలేదు. దీనికితోడు సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో నీటి పథకం కోసం అమర్చిన పైపులు ఎక్కడిక్కడ లీకేజీలై మరమ్మతుల పాలయ్యాయి.

పంచాయతీ అధికారులు, మండల స్థాయి అధికారులకు పంచాయతీ ఉప సర్పంచ్ మత్స్య కొండబాబు విన్నవించినా స్పందన కరువైంది. దీంతో ఆయ గ్రామాల నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊబులగరువు, గల్లెలు గ్రామాలకు కాలినడకన వెళ్లి ఊట నీటిని సేకరించి బిందెలతో గ్రామానికి తీసుకువస్తున్నామని మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో సంతవీధి, సరియపల్లిలకు జలజీవన్ నిధులు రూ. 22 లక్షలు వెచ్చించి రెండు చోట్ల బోరు పాయింట్లు వేశారు.

కానీ, నేటికీ వాటినుంచి నీరు అందించకుండా అధికారులు నిరక్ష్యం వహిస్తున్నారని ఆ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆ బోర్లు ప్రస్తుతం నిరుపయోగంగా మూలన చేరాయని స్థానికులు చెబుతున్నారు. వేసవి ప్రారంభానికి ముందే తమకు నీరు అందడంలేదని, ముందు ముందు ఇంకెలా అందోళన వ్యక్తంచేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి తమ గ్రామాల దాహం తీర్చి నీటి సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

సకాలంలో ఆదాయ, కుల ధ్రువపత్రాలను అందించాలి

- కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవసరమైన జనన, కుల, నివాస తదతర ధ్రువపత్రాలను సకాలంలో అందించాలని కలెక్టర్ ఏఎస్. దినేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రజల సేవలపై వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ప్రధానమైన జనన, మరణ, కుల, ఆదాయం తదితర ధ్రువపత్రాలు అవసరమవుతాయన్నారు. వీటి కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా సకాలంలో అందించాలన్నారు. వివిధ ధ్రువపత్రాలను సలువుగా పొందేందుకు ఉన్న ఏపీ సేవా సర్వీసెస్‌ను ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించాలన్నారు. గ్రామసచివాలయాల్లో దరఖాస్తుల ప్రక్రియలో డిజిటల్ అసిస్టెంట్ కీలకపాత్ర పోషించాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్ సెలవు పెడితే, సేవలకు ఆటంకం కలగకుండా ఎంపీడీవోలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు.

వారానికో సచివాలయంలో అవగాహన

జిల్లాలో అధిక శాతం నిరక్షరాస్యులైన గిరిజనులైనందున ధ్రువపత్రాలపై వారానికో సచివాలయంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. వివాహ రిజిస్ట్రేషన్లపైనా అవగాహన కల్పించి ఈ వివరాలు నమోదయ్యేలా చూడాలన్నారు. అలాగే రెవెన్యూ సదస్సుల్లోని వినతులను రానున్న నెల రోజుల్లో పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా సాధికర సంస్థ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణ, సబ్‌కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత, డీపీవో బి.లవరాజు, డీఎల్‌పీవో పీఎస్.కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ నాగరాజు, పాడేరు డివిజన్ పరిధిలోని ఎంపీడీవోలు, తాహసీల్దార్లు పాల్గొన్నారు.

జీవో 3 పునరుద్ధరణకు కృషి: పీడీఎఫ్ అభ్యర్థి


బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రచారంచేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి విజయ గౌరి

చింతపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ ప్రాంతాల్లో జీవో 3 పునరుద్ధరణకు కృషి చేస్తానని ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి గోరెడ్ల విజయ గౌరి తెలిపారు. శుక్రవారం స్థానిక గిరిజన సంక్షేమశాఖ బాలుర, బాలికలు, వంగసార బాలికలు ఆశ్రమ పాఠశాలను సందర్శించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తాను బొబ్బిలి రామభద్రపురం ఎంపీపీ పాఠశాలలో పీఎస్ ఉపాధ్యాయురాలిగా పనిచేశానని, ఈస్థితిలో ఉపాధ్యాయ సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్నదన్నారు. నిరుద్యోగులకు శతశాతం ఉద్యోగాలు కల్పించే జీవో 3 పునరుద్ధరణకు తన వంతు పోరాటం చేస్తానన్నారు. 1/70 చట్టం పటిష్టతకు పనిచేస్తానన్నారు.విద్యారంగానికి నష్టం కలిగే 117 జీవో రద్దుకు కృషి చేస్తానన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో వార్డెన్, ఏఎన్ఎంల నియామకాలకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానంగా ప్రైవేటు విద్యా సంస్థలలో ఉపాధ్యాయ, అధ్యాపకులు, సిబ్బందికి వేతన చట్టం, హెల్త్‌కార్డులు, ప్రత్యేక పెన్షన్ పథకం, 200 గజాల ఇంటి స్థలం, సెలవులు, సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. త్రిమూర్తులు, యూటీఎఫ్ మండలాధ్యక్షుడు శెట్టి రామకృష్ణ, డిగ్రీ కళాశాల గ్రంథాలయ అధికారి జగత్‌రాయ్ పాల్గొన్నారు.

హుకుంపేట: ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పీడీఎఫ్ అభ్యర్థి కోరేడ్ల విజయగౌరి కోరారు. స్థానిక గాంధీనగర్ ఆశ్రమపాఠశాలలో ఆమె శుక్రవారం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు.యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉమమహేశ్వరరావు, జి.మాడుగుల, పెదబయలు నేతలు మసాడ శ్రీను, సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువతపై మాతృభాష పరిరక్షణ బాధ్యత


మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రసూల్

పాడేరురూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పాడేరు ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా రజతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో తెలుగు శాఖాధిపతి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.టీఎస్.రసూల్ మాట్లాడుతూ పరాయి భాష మనుగడకు, అభివృద్ధికి ఉపయోగపడుతుందని, మాతృభాష వ్యక్తీకరణ నైపుణ్యాలకు తోడ్పడుతుందన్నారు. అంతరించి పోతున్న గిరిజన భాషలు, వాటి పరిరక్షణకు నేటి యువత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అర్థశాస్త్ర శాఖాధిపతి ఎ.మురళీధరరావు, రాజనీతి శాస్త్ర శాఖాధిపతి డాక్టర్.వి.రమేశ్ బాబు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్, ఆంగ్ల శాఖాధిపతి పి.కోటేశ్వరరావు మాతృభాషా ప్రాముఖ్యతను వివరించారు. అధ్యాపకులు నిర్మలాదేవి, ఎం. రాధాకుమారి, గోవిందరాజులు, యు.వారిజ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

పాడేరురూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైం షిప్‌బిల్డింగ్ (సీఈఎంఎస్), విశాఖ పోర్టు అథారిటీల సీఎస్ఆర్ నిధులతో 27 ఏళ్ల లోపు వయస్సు కలిగి 10వ తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ వెల్డర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డిప్లొమో, ఇంజనీరింగ్ మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాల్లో ఉత్తీర్ణులైన వారికి వివిధ అంశాల్లో 3 నెలలపాటు ఉచిత శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తెలిపారు. అలాగే, అల్లూరి జిల్లా యువతకు ఇన్వెంటరీ కంట్రోలర్, వెల్డర్ కోర్సులలో ఉచిత వసతితో కూడిన రెండు నెలల శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.సేతుమాధవన్ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు సీఈఎంఎస్ కేంద్రంలో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్లు: 86884 11100, 83319 01237, 0891- 2704010 సంప్రదించాలన్నారు.

పెసా గ్రామ సభలకు ప్రత్యేక అధికారాలు

- ఏపీఎస్ఐఆర్‌డీ డిప్యూటీ డైరెక్టర్ రామనాథం


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ రామనాథం

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పెసా గ్రామ సభలకు ప్రత్యేక అధికారాలు ఉంటాయని ఏపీఎస్ఐఆర్‌డీ డిప్యూటీ డైరెక్టర్ జె.రామనాథం అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో డ్వాక్రా మహిళలు, వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న పేసా చట్టం శిక్షణ తరగతులను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ నాయకులు చట్టంపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. పెసా గ్రామ సభకు విశిష్ట అధికారాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ పథకాలు గిరిజనులకు పూర్తి స్థాయిలో అందాలంటే కమిటీలు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఆదివాసీల స్వపరిపాలనకు పేసా కమిటీలది కీలకపాత్ర అన్నారు. ఈ కార్యక్రమంలో డీటీఎం చిన్నారావు, ఎంపీడీవో వై. ఉమామహేశ్వరావు, ఈవోఆర్‌డీ పాపారావు పాల్గొన్నారు.

చింతపల్లి: గ్రామ స్థాయిలో పెసా చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పెసా శిక్షణ తరగతుల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. పెసా గ్రామ సభకు విశిష్ట అధికారాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: ఆదివాసీల అభ్యున్నతికి పెసా చట్టం ఎంతో కీలకమని అఖిల భారత గిరిజన హక్కుల మార్గదర్శకులు గిరిష్ కుబేర్ అన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న పెసా శిక్షణ తరగతుల శుక్రవారం ఆయన హాజరై ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత్ హితరక్ష్ ప్రముఖ్ ప్రసాదు, సామర్లకోట డీటీసీ ఫ్యాకల్టీ బి.మోహన్‌రావు, ఇన్‌చార్జీ ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు చిన్నాన్న, సింహాచలం, సత్యరంజన్, తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ప్రజల స్వయం పాలనకు దోహదపడే పెసా చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన తప్పనిసరి అని ప్రముఖ న్యాయవాది మోహనరావు అభిప్రాయపడ్డారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్,వెలుగు కార్యాలయాల్లో నూతనంగా ఎన్నికైన పెసా కమిటీ ప్రతినిధులకు శిక్షణ కార్య క్రమం జరిగింది. ఆయన పరిశీలకుడిగా హాజరైన మోహనరావు మాట్లాడుతూ, షెడ్యూల్డ్ ప్రాంతాలు రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ ద్వారా గుర్తించినవని పేర్కొన్నారు. పెసా చట్టం సంప్రదాయ అటవీ నివాసితుల హక్కులు, సంస్కృతి, వనరులను పరిరక్షిస్తుందన్నారు. శిక్షణలో 200 మంది డ్వాక్రా సంఘాల ప్రెసిడెంట్లు, ఇతర సిబ్బంది 193 మంది హాజరైనట్టు ఎంపీడీవో పూర్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పరిశీలకులు, వనవాసి కళ్యాణ ఆశ్రమం సభ్యులు, వైస్ ఎంపీపీ రాజుబాబు,రాష్ట్ర స్థాయి పరిశీలకులు ప్రసాద్, ఈవోఆర్‌డీ నరసింగరావు, ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.



పెదబయలు: మాట్లాడుతున్న న్యాయవాది మోహనరావు

పోస్టల్ ఖాతాలతో ఆర్థిక భరోసా


పోస్టల్ సేవలపై వివరిస్తున్న ఐపీవో లక్ష్మీకిశోర్

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అరకు సబ్ డివిజన్ పోస్టల్ ఐపీవో లక్ష్మీకిశోర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం అవగాహన కల్పించారు. ఐపీవోతో పాటు సిబ్బంది ఇంటింటికి వెళ్లి పోస్టల్ శాఖ అమలు చేస్తున్న పొదుపు ఖాతాలపై వివరించారు. కర పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఐపీవో లక్ష్మీకిశోర్ మాట్లాడుతూ పోస్టల్ శాఖలో పొదుపు ఖాతాలను తెరిచి ఆర్థిక భరోసా పొందాలను సూచించారు. ఈ ఖాతాల ద్వారా తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ లభిస్తుందన్నారు. ఎస్‌బీ, ఆర్‌డీ, సుకన్య, ఆర్‌పీఎల్ఐ, పీఎల్ఐ, బీమా, ఐపీపీబీ తదితర ఖాతాల ద్వారా లబ్ధి పొందాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంవో ఎం.శ్రీను, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్లు లోహితాష్, శ్రీను, సన్ని సురేశ్, గణపతి, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా రఘువర్మను గెలిపిస్తే అభివృద్ధి

- జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్


శివలింగపురంలోని ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

అనంతగిరి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చట్టలకు సభలపై అవగాహన కలిగిన రఘువర్మను ఎమ్మెల్సీగా గెలిపిస్తే అభివృద్ధి సాధ్యపడుతుందని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ సూచించారు. మండలంలోని శివలింగపురం ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులను కలిశారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి ప్రభుత్వం బలపరిచిన పాకలపాటి రఘువర్మను గెలిపించాలని కోరారు. ఉత్తరాంధ్రపై పట్టుకలిగిన నాయకుడని, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించేదిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని, అవగాహన లేని వ్యక్తులను ఎన్నుకోవడం మన అభివృద్ధిని మనమే అడ్డుపడినట్టేనని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శి టి.ఆనందరావు, కార్యవర్గ సభ్యులు ఎం.జోగులు, అమ్మన్న, నూకరత్నం, ద్రౌపది, బిడ్డ లక్ష్మణరావు, దేముడు, దొన్ను, రంజీత్, శ్యామ్, జగన్‌బాబు, ఏపీటీఎఫ్ నాయకులు సన్యాసిరావు, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి బలపరిచిన అభ్యర్థికి మద్దతుగా ప్రచారం


ఉపాధ్యాయులకు కరప త్రాలందిస్తున్న టీడీపీ నేత రమేష్‌నాయుడు తదితరులు

కొయ్యూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి బలపరిచిన పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి టూరిజం డైరెక్టరు కిల్లు రమేశ్‌నాయుడు కోరారు. ఈ మేరకు శుక్రవారం మండలంలో గురుకుల పాఠశాలతో పాటు పలు ఆశ్రమ పాఠశాలలను సందర్శించి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జి. సత్యనారాయణ, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మూర్తి, టీఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు సన్యాసిరావు, నాయకులు వరహాలబాబు, పుల్లయ్య, కిలే బాలరాజు, ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య నిపుణుల పోస్టులు భర్తీ చేయాలి

- గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు పీవీ రమణ


చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న రమణ

చింతపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక వైద్యనిపుణుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు పీవీ రమణ కోరారు. శుక్రవారం మండలంలో పర్యటించిన ఆయన తొలుత గిరిజన ఉద్యోగులతో సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏరియా ఆస్పత్రిని సందర్శించి రోగులు, వైద్యులతో ఆయన మాట్లాడారు. ఆసుపత్రిలో ప్రత్యేక వైద్యనిపుణులు అందుబాటులోలేక నర్సీపట్నం, పాడేరు, కేజీహెచ్ ఆస్పత్రులకు తమను తరలిస్తున్నట్టు రోగులు తెలియజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రిలో గైనకాలజిస్టు, ఎనస్థీషియా, జనరల్ ఫిజీషియన్, పిడియాట్రిక్స్, ఇతర పోస్టులు ఖాళీగావున్నాయన్నారు. గైనికాలజిస్టు లేక గిరిజన గర్భిణులు పురిటినొప్పులతో సుదూర ప్రాంతాలు ప్రయాణం చేయాల్సివస్తుందన్నారు. అలాగే షెడ్యూల్డ్ ప్రాంతాల్లో జీవో 3ను పునరుద్ధరించాలన్నారు. ఈకార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లోచల రామకృష్ణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యూవీ గిరి, మండలాధ్యక్షుడు బొడు గంగరాజు, జిల్లా కార్యదర్శులు గెమ్మెలి మోహన్, దేపూరి శశికుమార్, జీకేవీధి నేతలు జి. మల్లేశ్వరరావు, కామేశ్వరరావు, రమేశ్ నాయుడు పాల్గొన్నారు.

'విద్యుత్ మీటర్‌కు అధిక ఫీజు వసూలు'


ఎల్ఐకు ఫోన్‌పే చేసిన వివరాలు చూపుతున్న సన్నిబాబు

పెదబయలు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల నుంచి విద్యుత్ మీటరు మంజూరులో అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్న పెదబయలు లైన్ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజుపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి బొండా సన్నిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ,సీతగుంట పంచాయతీ రోగులపేట కాలనీ వద్ద బొండా లోహిదాసు నిర్మించిన నూతన భవనానికి కేటగిరి -2 విద్యుత్ మీటరు కావాలని పెదబయలులోనిసబ్ సెంటర్‌కు శుక్రవారం వెళ్లిలైన్ ఇన్‌స్పెక్టర్‌ను కోరారన్నారు. ఈ మీటరుకు రూ.8800 అవుతుందని సూచించడంతో లోహిదాసు కుమారుడు రవి ఎల్ఐకు ఫోన్‌పే ద్వారా ఆ సొమ్ము పంపించారన్నారు. ఇంత పెద్దమొత్తంలో డబ్బు వసూలు గుర్తించి లైన్ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడాలని సబ్‌సెంటర్‌కు వెళితే ఆయన కనించలేదన్నారు.ఈ స్థితిలో ఎల్ఐపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మీటర్లకు నిర్దేశించిన ధరల పట్టికను సబ్ సెంటర్ వద్ద ప్రదర్శించాలని కోరారు.

నిర్దేశించిన ఫీజును మాత్రమే అడిగా: ఎల్ఐ

ఈ విషయంపై లైన్ ఇన్‌స్పెక్టర్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రసావించగా బొండా లోహిదాసు విద్యుత్ మీటరు కావాలని తన వద్దకు వచ్చారని, అయితే, ప్రభుత్వం నిర్దేశించిన డబ్బు మా త్రమే అడిగానని అన్నారు.


పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడికి సన్మానం

జి.మాడుగుల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీరం పంచాయతీ తాడివీధి పాఠశాలలో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు దూరు నారాయణకు శుక్రవారం నుర్మతి స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. విధుల పట్ల అంకిత భావంతో నారాయణ పనిచేశారని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

గిరి మహిళలకు చీరలు పంపిణీ

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు కె. క్రిష్ణకుమారి మండలంలోని పోతంగి పంచాయతీ లివిటీపుట్టులో గిరి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కృష్ణకుమారి కేజీబీవీ పాఠశాలలో కాంట్రాక్టర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. అయినా, ఆమె పలు సేవా కార్యక్రమాలు చేపడుతుండడంపై పలువురు అభినందించారు.

కొయ్యూరులో భారీ వర్షం


చింతాలమ్మఘాట్‌లో కురుస్తున్న వర్షం

కొయ్యూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు పరిసర గ్రామాలలో శుక్రవారం మధ్యాహ్నం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వాతావరణం సాధారణంగా వుంది. అకస్మాత్తుగా వాతావరణంలో మార్పులు సంభవించి ఆకాశం మేఘావృతంగా మారి చిరుజల్లులతో ప్రారంభమై కొయ్యూరు, కాకరపాడు, నడింపాలెం తదితర గ్రామాలలో ఒక మోస్తరు గానూ చింతలపూడి నుంచి రావణాపల్లి తదితర పలు గ్రామాలలో భారీగానూ వర్షం కురిసింది. ఈ వర్షం పూత దశలో ఉన్న మామిడి, జీడిమామిడి పంటలకు ఉపకరిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


ఫార్మర్ రిజిస్ట్రీని పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీదేవి

ఫార్మర్ రిజిస్ట్రీలో పేర్లు నమోదు చేసుకోండి

▸ వ్యవసాయ శాఖ ఏడీ శ్రీదేవి

నర్సీపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమి ఉన్న ప్రతీ రైతు సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రీలో పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ శ్రీదేవి పిలుపు నిచ్చారు. శుక్రవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతీ రైతుకు 11 అంకెలతో గుర్తింపు కార్డు ఇస్తుందన్నారు. ఆధార్ కార్డు, ఆధార్‌కి అనుసంధానం చేసిన ఫోన్ నంబరు, పట్టాదార్ పాసు పుస్తకం వివరాలతో రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. డివిజన్ పరిధిలో 73,449 మంది రైతులు ఉండగా, ఇప్పటి వరకు 23,919 మంది నమోదు చేసుకున్నారన్నారు. పీఎం కిసాన్, వ్యవసాయ పెట్టుబడి సాయం, యంత్ర సామగ్రి పంపిణీ, పంటల భీమా పథకాల మంజూరుకు తప్పన సరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు.

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన


చెట్టుపల్లి జడ్పీహెచ్ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ దృశ్యం

నర్సీపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శన ఆకట్టుకుంది. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 98 నమూనాలు ప్రదర్శించారు. రోబోటిక్, పర్యావరణ పరిరక్షణ, భౌతిక, రసాయణ, జీవ శాస్త్రం అంశాలపై విద్యార్థులు నమూనాలు తయారు చేశారు. రోలుగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు కర్రి శ్రీనివాసరావు, ఎల్.తులసి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రదర్శనలో ఎంపికైన నమూనాలకు ఈ నెల 28న బహుమతులు అందజేస్తామని హెచ్ఎం వి.రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు రాజగోపాల్, పాఠశాల కమిటీ ఛైర్మన్ ఈశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేదికపైన పారిశుధ్య కార్మికులకు చోటు

▸ అవగాహన సదస్సులో సముచిత స్థానం


వెంకన్నపాలెంలో అధికారులతో పాటు కూర్చొన్న పారిశుధ్య కార్మికులు

చోడవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సభలు, సమావేశాల్లో వేదికల పరిసరాలను పరిశుభ్రం చేసే పనులకే పరిమితమయ్యే పారిశుధ్య కార్మికులను తమతో సమానంగా వేదికపై కూర్చోపెట్టి అధికారులు సముచిత గౌరవం కల్పించారు. మండలంలోని వెంకన్నపాలెంలో శుక్రవారం తడిచెత్త, పొడిచెత్తపై పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదికపైన ఎంపీడీవో అంజనేయులు, ఈవోపీఆర్డీ మహేశ్ తదితరులతో పాటు పారిశుధ్య కార్మికులను కూడా వేదికపైన కూర్చోబెట్టి అధికారులు పారిశుధ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. తడి, పొడిచెత్త సేకరణ, నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం అధికారులు గ్రామంలో తిరిగి స్థానికులకు కూడా ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.

పుష్కరిణి ఆధునికీకరణ పనులు పూర్తిచేయండి

▸ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు


పుష్కరిణి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వయంభూ గౌరీశ్వరాలయం పుష్కరిణిని ఆధునికీకరణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆదేశించారు. శుక్రవారం గౌరీశ్వరాలయంలో పుష్కరిణి పనులను పరిశీలించారు. వచ్చే శివరాత్రి నాటికి ఆలయంలో భక్తులకు ఇబ్బంది లేకుండా అవసరమైన ఇతర సౌకర్యాల కల్పనపై దేవదాయ శాఖ అధికారులు ఉత్సవ కమిటీ సభ్యులు చేపట్టాల్సిన చర్యలపై ఉత్సవ కమిటీ సభ్యులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎంపీపీ పెదబాబు, ఆలయ కమిటీ ఛైర్మన్ గూనూరు సురేశ్, సభ్యులు పాల్గొన్నారు.

చెత్తను సంపద రూపంలో సృష్టించాలి: ఎంపీడీవో


నాలుగు రోడ్ల కూఢలిలో మానవహారంగా ఏర్పడిన కార్మికులు

దేవరాపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చెత్తను సంపద రూపంలో సృష్టించాలని ఎంపీడీవో సువర్ణరాజు సూచించారు. మండలంలోని క్లాప్ మిత్రలు 'చెత్త వేయకు.. పాపం చేయకు' అనే నినాదంతో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తూ పారిశుధ్యంపై అవగాహన కలిగించారు. అనంతరం దేవరాపల్లి సంపద కేంద్రం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతీ ఇంటిలో తడిపొడి చెత్తను క్లాప్ మిత్రల (హరిత రాయబారులు)కు అందజేయాలన్నారు. ఇలా చేయడం ద్వారా ప్రతీ ఇంటిలో ప్రజలు ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.సుధాకరబాబు, కోఆర్డినేటర్ త్రినాథ్, జామి అప్పారావు, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కష్టాలకు చెల్లు

కూటమి ప్రభుత్వం చొరవతో పది గ్రామాలకు విద్యుత్ కష్టాలు తీరనున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఆయా ప్రాంతాల ప్రజల ఎదురుచూపులు ఫలిస్తున్నాయి. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రత్యేక శ్రద్ధతో సబ్ స్టేషన్ కోసం రూ.3.7 కోట్లు మంజూరయ్యాయి. అర ఎకరం విస్తీర్ణంలో స్థలం లభ్యం కావడంతో ఇప్పటికే చదును చేసే పనులు కూడా జరుగుతున్నాయి.

- ▸ చౌడువాడలో సబ్ స్టేషన్‌కు రూ.3.7 కోట్లు మంజూరు
- ▸ అర ఎకరం విస్తీర్ణంలో ఏర్పాటుకు స్థలం చదును
- ▸ రెండు మండలాల్లో పది గ్రామాలకు తీరనున్న ఇబ్బందులు
- ▸ కూటమి ప్రభుత్వం చొరవపై ఆయా ప్రాంతాల ప్రజల హర్షం


సబ్ స్టేషన్ ఏర్పాటుకు చదును చేస్తున్న స్థలం ఇదే..

కె.కోటపాడు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడువాడ చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజలను విద్యుత్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. లోవోల్టేజీ కారణంగా ఇళ్లల్లోని ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, టీవీలు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయి. అలాగే చిన్న చిన్న పరిశ్రమలు, రైస్ మిల్లుల యజమానులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ కష్టాలు పోవాలంటే సబ్ స్టేషన్ ఏర్పాటు ఒకటే పరిష్కారమని స్థానిక సర్పంచ్ ఎరుకునాయుడు భావించారు. ఇందుకోసం గత వైసీపీ ప్రభుత్వం నుంచి ప్రజలతో కలిసి పోరాడుతున్నా ఫలితం లేకపోయింది. తాజాగా తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి ఈ సమస్యను తీసుకున్నారు. ఆయన తక్షణమే స్పందించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో చౌడువాడలో 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.7 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

పది గ్రామాలకు తీరనున్న సమస్య

చౌడువాడలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తే కె.కోటపాడుతో పాటు చోడవరం మండలంలోని పది గ్రామాల ప్రజలకు లోవోల్టేజీ సమస్యలు తొలగిపోనున్నాయి. మండలంలోని చౌడువాడతో పాటు పది గ్రామాల ప్రజలు లోవోల్టేజి సమస్యలతో పడుతున్న ఇబ్బందులు తొలగిపోనున్నాయి. మండలంలోని చౌడువాడతో పాటు గరుగుబిల్లి, మల్లంపాలెం, పైడమ్మపేట, పాచిలవానిపాలెం, గుల్లేపల్లి, గొందుపాలెం, చోడవరం మండలంలోని రాయపురాజుపేట, సేమునాపల్లి, నరసాపురం, జుత్తాడ గ్రామాలు ఈ సబ్ స్టేషన్ పరిధిలోకి రానున్నాయి. నిధులు మంజూరు కావడంతో సబ్ స్టేషన్ ఏర్పాటుకు అర ఎకరం స్థలం కూడా సమకూరింది. ప్రస్తుతం చౌడువాడ డంపింగ్ యార్డును ఆనుకొని సమకూరిన ఈ స్థలాన్ని సర్పంచ్ దాడి ఎరుకునాయుడు చదును చేయిస్తున్నారు. సుమారు అర ఎకరం విస్తీర్ణం ఉన్న ఈ స్థలంలో తుప్పలను తొలగిస్తున్నారు. అలాగే ఈ సబ్ స్టేషన్‌కు కె.కోటపాడుతో పాటు చోడవరం మండలంలోని వెంకన్నపాలెం నుంచి ప్రత్యేకంగా రెండు లైన్లు ఏర్పాటు చేస్తారు. చౌడువాడకు ప్రత్యేకంగా ఒక ఫీడర్ లైన్ వేస్తారు. దీని ద్వారా పది గ్రామాల ప్రజలకు 24 గంటలూ అంతరాయం లేని విద్యుత్ అందుతుంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో సర్వేలను మరింత మెరుగుపర్చాలి

▸ జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి


ఈశ్రమ కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న సీఈవో

మాడుగుల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో చేస్తున్న పలు రకాల సర్వేలను మరింత మెరుగుపరచాలని జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ ఉద్యోగులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే వివిధ పనులపై సచివాలయాలకు వచ్చే ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని చెప్పారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి ఎంపీడీవో కొంకి అప్పారావుకు పలు సూచనలు చేశారు. అలాగే స్థానిక తాచేరు కాలువ సమీపంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన పంచాయతీరాజ్ అతిథి గృహాన్ని పరిశీలించారు. అనంతరం శతకం పట్టు వద్ద ఈశ్రమ కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మల్లేశ్వరి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో అమ్మకాలకు ప్రోత్సాహం అందిస్తాం

సీఐఐ యంగ్ ఇండియన్స్ బృందం చాప్టర్ కో ఛైర్మన్ దీపిక కొడాలి


మాడుగుల్లోయంగ్ ఇండియన్ బృందం ప్రతినిధులు

మాడుగుల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సహజ సిద్ధంగా ఏజెన్సీలో పండించే పసుపు, మాడుగుల ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన హల్వా యంగ్ ఇండియా ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా అమ్మకాలకు వాణిజ్య పారిశ్రామిక యంగ్ ఇండియన్స్ (సీఐఐ) ద్వారా పోత్సాహం అందిస్తామని సీఐఐ యంగ్ ఇండియన్స్ బృందం చాప్టర్ కో ఛైర్మన్ దీపిక కొడాలి అన్నారు. మాడుగుల తులసీ మోదమాంబ కల్యాణ మండపంలో పసుపు, హల్వా వ్యాపారులతో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు ఈ ప్రాంతంలో పసుపు, హల్వాకు ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్నాయని, వాటిన విదేశీ మార్కెట్లలో ఆన్‌లైన్ ద్వారా అమ్మకాలు చేపడితే అధిక లాబాలు పొందవచ్చన్నారు. ఆన్‌లైన్ విధానంలో పసుపు, హల్వా విక్రయించడం వల్ల వచ్చే ఉపయోగాలు గురించి వివరించారు. అంతకుముందు జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాల, మండల పరిషత్ పాఠశాల, గాదిరాయి జిల్లా పరిషత్ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు దివ్య జమ్ముల, సుప్రియ, రమ్య, ప్రత్యూష, అర్చన, తాన్య, సోనియా, పి.అప్పలరాజు, నాయకులు పి.రమేశ్, రొబ్బా మహేశ్ లెక్కల కాశిబాబు, సూర్యనారాయణరాజు, జొన్నపల్లి రమేశ్ డిల్లీ నానాజీ, మరువాడ ఈశ్వరావు, నాగేశ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మకు మద్దతివ్వండి

విద్యా సంస్థల్లో టీడీపీ నేతల విస్తృత ప్రచారం

చోడవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై అవగాహన ఉన్న రఘువర్మకు మద్దతివ్వాలని నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి నల్లారి సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు. స్థానిక కొత్తూరు బాలికల హైస్కూల్‌తో పాటు లక్ష్మీపురం హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, గాంధీగ్రామం, కస్తూరిబా స్కూళ్లలో శుక్రవారం గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని, టీడీపీ బలపరిచిన రఘువర్మకు ఓటేసి గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు భూతనాధు నానికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

నర్సీపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, విశాఖపట్నం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో 18 ఏళ్లు నిండిన యువకులకు వాలీబాల్, షటిల్, షార్ట్‌పుట్, రన్నింగ్, బాక్సింగ్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజు పోటీలను ప్రారంభించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ జి.ఉమామహేశ్వరరావు, నాయకులు బోళెం శివ, వెలగానారాయణరావు, బాక్సింగ్ కోచ్ యర్రా శేఖర్ పాల్గొన్నారు.

అల్లూరి వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల అల్లూరి వాసవి క్లబ్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెక్కా సంతోశ్‌బాలజీ, యక్కల నాగేశ్వరావు అన్నారు. శుక్రవారం గొలుగొండ మండలం ఏఎల్‌పురంలో ఏఎల్‌పురంలో 45 మంది కుటుంబ సభ్యులతో అల్లూరి సీతారామరాజు వాసవీ క్లబ్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ పూర్ణిమ ఆధ్వర్యంలో నూతనంగా క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ ఇంటర్నేషన్ గవర్నర్ పూర్ణిమ మాట్లాడుతూ వాసవీ క్లబ్ ద్వారా పేద ప్రజలకు వివిధ రూపాల్లో సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మండల అధ్యక్షుడిగా సిహెచ్‌వీ.బాలాజీ, కార్యదర్శిగా యక్కల నాగేశ్వరావు, కోశాధికారిగా కె.రామారావు, కార్యవర్గ సభ్యులు పాపారావు, అప్పలరాజు, బ్రహ్మాజీ, కె.కృష్ణరాజు, కె.అప్పారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వైసీపీ మండల అధ్యక్షుడిగా బూరే బాబూరావు



దేవరాపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల అధ్యక్షుడిగా బూరే బాబూరావును నియమించారు. బి.కింతాడ సర్పంచ్‌గా పని చేస్తున్న బూబూరావు పార్టీలో చురుకైన పాత్ర పోషించారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆశీస్సులతో తనకు రెండోసారి ఈ పదవి దక్కినట్టు ఆయన తెలిపారు. ఈ పదవి అప్పగించడంతో మరింత బాధ్యతను పెంచారన్నారు.

సంపద తయారీతో పంచాయతీలకు ఆదాయం


చెత్త నుంచి సంపద తయారీ శిక్షణలో గ్రీన్ అంబాసీడర్లు

రావికమతం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీతో గ్రామాల పరిశుభ్రతతో పాటు పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని పంచాయతీ విస్తరణ అధికారి బానోజీరావు అన్నారు. మేజరు పంచాయతీ కొత్తకోటలో చెత్త నుంచి సంపద తయారీపై కార్యదర్శులు, పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీతో వర్మీ కంపోస్టు తయారీ, అనంతరం రైతులకు ఎరువుగా విక్రయించడం వల్ల పంచాయతీలకు ఆదాయం సమకూరుతోందన్నారు. చెత్త సేకరణను ఆదాయ వనరుగా మార్చుకోవచ్చున్నారు. మండలంలో 28 గ్రామ పంచాయతీల లోనూ ఈ కార్యక్రమంపై దశలవారీగా అవగాహన కల్పిస్తామన్నారు. ప్రతీ సంపద కేంద్రం వినియోగంలోకి తీసుకోస్తామన్నారు. గ్రామంలో తడిపొడి చెత్త ఏ విధంగా వేరు చేయాలో గ్రీన్ అంబాసిడర్లకు వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శులు కృష్ణమోహన్, పోలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందేలు


బరిలో పరుగులు తీస్తున్న ఎద్దులు

చీడికాడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అభయాంజనేయ తీర్థ మహోత్సవం సందర్భంగా జరిగిన ఈ పోటీల్లో 15 జతల ఎడ్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతి సామాలమ్మ ఎడ్ల జత (చుక్కపల్లి), రెండో బహుమతి పరవాడ నాయుడు బాబు (అర్జునగిరి)కి దక్కాయి. విజేతలకు, ఎడ్ల జతల యజమానులకు సర్పంచ్ కొల్లి సూరినాయుడు, నీటి సంఘం అధ్యక్షుడు పైడంనాయుడు అభినందనలు తెలిపారు.

దేవరాపల్లిలో చిరు జల్లులు


దేవరాపల్లిలో కురుస్తున్న వర్షం

దేవరాపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లిలో శుక్రవారం సాయంత్రం చిరు జల్లులు కురిశాయి. ఈ వర్షం వల్ల మినుము, పెసర పంటలు తడిచిపోయాయి. కళ్లాల్లో ఎండిన చేను కుప్పలు వేయడానికి రైతులు ఇబ్బందులు పడ్డారు.

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్.నాగాపురం, పల్లావూరు, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట గ్రామాల్లో శుక్రవారం చిరుజల్లు పడ్డాయి. దీంతో వారం రోజులుగా ఎండతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం లభించింది. ఈ చిరుజల్లుతో జీడిమామిడి పంటకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరింత వర్షం పడితే జీడిమామిడి తోటలకు ఎంతగానో మేలు జరుగుతుందని వారు తెలిపారు.

'అనాథ మృతదేహాలకు దహన సంస్కారాలు చేస్తాం'

రావికమతం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇకపై అనాథలు మరణిస్తే తామే దహన సంస్కారాల ఖర్చును భరిస్తామని కొత్తకోటకు చెందిన అంబేడ్కర్ యూత్ సభ్యులు ప్రకటించారు. ఈ మేరకు యువకులు ఎం.కనకరాజు, టైగర్, జి.మోషే, కె.ప్రసాద్, టి.జాన్, ఎన్.ప్రసాద్, ఎన్.శివ యువకులు వారి ఫోన్ నంబర్లతో ఫ్లెక్సీని తయారు చేసి శ్మశాన వాటిక వద్ద అతికించారు. తమను సంప్రదిస్తే తక్షణమే దహన సంస్కారాలకు ఆర్థిక సాయం అందిస్తామని వారు పేర్కొన్నారు.

జాతీయ స్థాయి చిత్రకళ పోటీల్లో నాతవరం విద్యార్థుల ప్రతిభ

నాతవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో జరిగిన చిత్రకళ పోటీల్లో నాతవరం మండలం డి.యర్రవరం స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఫిబ్రవరి 18, 19, 20 తేదిల్లో గుంటూరులో జరిగిన జాతీయస్థాయి చిత్రకళ ఈ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చి బంగారు, వెండి పతకాలను సాధించినట్టు కరస్పాండెంటెండ్ఏ.గిరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పతకాలు సాధించిన విద్యార్థులు ఆనందిని, ఆకార్, శశింక, శ్రీనివాసు తదితరులను అభినందించారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల సారె పండుగ

చోడవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చినబజారువీధిలో శుక్రవారం గౌరీపరమేశ్వరుల సారె పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా బజారువీధిలో భక్తులు గౌరీపరమేశ్వరుల సారెతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మురుగు తొలగించరూ..

గొలుగొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాకలపాడు గ్రామంలో పాఠశాల వద్ద పేరుకుపోయిన మురుగు తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గ్రామ కార్యదర్శి రాజేశ్‌కు వినతిపత్రం అందించారు. మండలంలోని పాకలపాడు గ్రామంలో హైస్కూల్‌తో పాటు ప్రాథమిక పాఠశాల వద్ద ఆనుకునివున్న కాలువలో పూడిక పేరుకుపోవడంతో విద్యార్థులకు దుర్వాసన వెదజల్లుతుందని, తక్షణమే తొలగించాలని తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరారు. తక్షణమే డ్రైనేజీ తొలగించేందుకు చర్యలు చేపడతామని కార్యదర్శి గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

23 నుంచి శివరాత్రి ఉత్సవాలు

రోలుగుంట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చెంపేట మినీ కైలాసగిరి వద్ద ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. 23న ముగ్గుల పోటీలు, 25న శివపార్వతుల పల్లకి ఊరేగింపు, 26న ఉదయం సాయంత్రం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నసమారాధన, రాత్రి దీపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలి

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలని కోరుతూ శంకరం గ్రామం గిరి రైతులు పాగి పెద పోతురాజు, చినపోతురాజు, శరగం దేముడమ్మ పలువురు శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. శంకరం గ్రామంలో ఆదివాసీలకు కేటాయించిన సుమారు 40 ఎకరాల డి.పట్టా భూములను మధ్యవర్తులు ద్వారా దోచుకుంటున్నారని ఆరోపించారు. భూ రికార్డులు, చట్టాలపై అవగాహన లేక గిరిజనులు మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. ఈ విషయంపై తహసీల్దారు రమాదేవిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా గిరిజనులు వినతిపత్రం ఇచ్చారని, విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉద్యాన పథకాలపై అవగాహన

జిల్లా ఉద్యానవన అధికారి జి.ప్రభాకర్

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యానవన పంటలపై అవగాహన అవసరమని జిల్లా ఉద్యానవన అధికారి జి.ప్రభాకర్ తెలిపారు. మండలంలోని కొమళ్లపూడి తులసీ కల్యాణ మండపంలో మాడుగుల, రావికమతం, చోడవరం, చీడికాడ, బుచ్చెయ్యపేట మండలాల రైతులకు ఉద్యాన పథకాలపై అవగాహన కల్పించారు. మామిడిపూతపై తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉద్యాన పథకాల అమలు, రైతు సేవా కేంద్ర సిబ్బంది పనితీరు, రైతులకు అందించే సేవలు, అన్ని పథకాలు అమలుపై ఆయన చర్చించారు. మార్కెటింగ్ శాఖ డీడీ రవికుమార్ మాట్లాడుతూ టమోటో రైతులకు లాభనష్టాలను వివరిచారు. ఈ సమావేశంలో ఉద్యానవన శాఖాధికారులు భాను, పుష్ప, లీలావతి, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ సలహా మండలి సమావేశం

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కేవీకే కొండెంపూడిలో ఎనిమిదో శాస్త్రీయ సలహా మండలి సమావేశాన్ని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ సిహెచ్.ముకుందరావు అధ్యక్షతన నిర్వహించారు. చెరకు దిగుబడులు తగ్గడానికి గల కారణాలపై రైతులతో చర్చగోష్ఠి నిర్వహించారు. విస్తరణ సంచాలకులు వి.విశాలాక్షి, జిల్లా ఉద్యాన అధికారి ప్రభాకర్, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ఎన్.రాజ్‌కుమార్, ఏడీఏలు వివిధ మండలాల వ్యవసాయ అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు సత్తిబాబు, సౌజన్య, కిశోర్, గౌరీకుమారి, వాసు, శ్రావ్య, రామునాయుడు, శైలజ పాల్గొన్నారు.

మత్స్య సంపద వృద్ధికి సముద్రంలో కృత్రిమ ఆవాసాలు

సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సూచనలతో దేశవ్యాప్తంగా ఏర్పాటు



(విశాఖపట్నం, భీమునిపట్నం రూరల్-ఆంధ్రజ్యోతి)


సముద్రంలో పెరుగుతున్న కాలుష్యం, వ్యర్థాల కారణంగా మత్స్య సంపద తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో మత్స్య సంపదను పెంచేందుకు సెంటర్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) సూచనల మేరకు కాంక్రీట్‌తో తయారుచేసిన ఆర్టిఫిషియల్ రీఫ్‌లను (కృత్రిమ ఆవాసాలు) ఏర్పాటు చేయబోతున్నారు. ఇప్పటికే మహారాష్ట్ర, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ఈ రీఫ్స్ ఏర్పాటుచేశారు. ఏయూలోని జియో ఫిజిక్స్ డిపార్టుమెంట్ వజ్రోత్సవ వేడుకల్లో ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) ఈ ఆర్టిఫిషియల్ రీఫ్స్‌కు సంబంధించిన నమూనాలను ప్రదర్శించింది. వీటి గురించి ఎఫ్ఎస్ఐ అధికారులు భామిరెడ్డి, జీవీపీ ప్రసాద్ వివరించారు.



కాంక్రీటుతో తయారు చేస్తున్న ఆవాసాలు

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో అనువైన ప్రాంతాల కోసం అన్వేషణ

కేంద్ర సముద్ర మత్స్య పరిశోధన సంస్థ (సి.ఎం.ఎఫ్.ఆర్.ఐ) సముద్ర గర్భంలో ఆర్టిఫిషియల్ రీఫ్‌లు (కృత్రిమ ఆవాసాలు) ఏర్పాటుచేసే విధానాన్ని అమలు జరుపుతోంది. మత్స్య సంపద విస్తారంగా లభించడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ సంస్థ అందిస్తోంది. తమిళనాడులో చేపల కృత్రిమ ఆవాసాలను ఏర్పాటుచేసి మంచి ఫలితాలను సాధించింది. మొదట ఐదు ప్రాంతాల్లో ఏర్పాటుచేస్తే నాలుగు రెట్లు చేపల ఉత్పత్తి పెరిగినట్టు పరిశోధకులు గుర్తించారు. ఈ విషయం మన రాష్ట్ర మత్స్య శాఖ ఉన్నతాధికారులు తెలుసుకుని సముద్ర తీరానున్న ప్రాంతాల్లో ఈ ఆవాసాలను ఏర్పాటుచేసే ఆలోచనలు చేస్తున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో భీమిలి మండలం అన్నవరం నుంచి పాయకరావుపేట వరకూ ఆవాసాల ఏర్పాటుకు అనుకూలమైన ప్రాంతాల కోసం అన్వేషిస్తున్నారు.



సముద్రగర్భంలో ప్రవాహం ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేసిన చేపల ఆవాసం

కృత్రిమ ఆవాసాలు ఎలా అమరుస్తారంటే...

సముద్ర తీరం నుంచి ఒక కిలోమీటరు పరిధిలో మినీ ట్రాలర్లు, ఇతర మర పడవలు చేపల వేట సాగించవు. అందువల్ల అటువంటి ప్రాంతాలలోనే ఈ ఆవాసాలను ఏర్పాటుచేస్తారు. ఒక్కో రీఫ్ టన్ను బరువు ఉంటుంది. వీటిని ఐదు నుంచి ఏడింటిని నౌకలతో తీసుకువెళ్లి ఒకేచోట డంప్ చేస్తారు. నీటి కింద ఈ ఆవాసాలను ఏర్పాటుచేస్తే చేపల వృద్ధికి ఢోకా ఉండదని అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం కాంక్రీట్‌తో వేర్వేరు రూపాల్లో ఆర్టిఫిషియల్ రీఫ్‌లను రూపొందిస్తారు. వాటికి అన్ని వైపులా రంధ్రాలను పెట్టి సముద్ర గర్భంలో 20 మీటర్ల లోతున అమరుస్తారు. ఒక్కో ఆవాసం తయారుచేసి నీటిలో అమర్చడానికి రూ.15 లక్షలు ఖర్చవుతుంద ని అధికారులు అంచనా వేశారు. చేపలు ఈ ఆవాసాల గోడలపై గుడ్లు పెట్టి సంతానాన్ని అభివృద్ధి చేయడానికి ఎంతో అనువుగా ఉంటాయని అధికారులు అంటున్నారు. చేపలకు కావల్సిన సహజ సిద్ధమైన ఆహారం నాచు, చిన్న చిన్న మొక్కలు ఏర్పాటుచేస్తారు. చేపలు పెరిగి పెద్దవైన తర్వాత ఆ పరిసర ప్రాంతాలలోనే స్వేచ్ఛగా తిరుగుతుంటాయి. ఈ ఆవాసాలు ఏ ప్రాంతంలో ఏర్పాటుచేస్తారో ఆ పరిసర గ్రామాల మత్స్యకారులకు ఇప్పుడు లభిస్తున్న చేపల కంటే నాలుగు రెట్లు అధికంగా లభిస్తుంటాయి. ఈ ఆవాసాలను భీమిలి, అచ్యుతాపురం, రాంబిల్లి, నక్కపల్లి, తదితర మండలాల్లో ఏర్పాటుచేసే ప్రతిపాదనలు ఉన్నాయి.

విశాఖ-తిరుపతి మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖపట్నం-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 08583 నంబర్ గల ప్రత్యేక రైలు ఈ నెల 24 నుంచి ఏప్రిల్ 28 వరకు ప్రతి సోమవారం రాత్రి 7.10 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08584 నంబరు గల ప్రత్యేక రైలు ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 29 వరకు ప్రతి మంగళవారం రాత్రి 9.55 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.15 గంటలకు విశాఖ చేరుతుంది.

పలు రైళ్లు రద్దు

సాంకేతిక కారణాల దృష్ట్యా విశాఖ-షాలిమార్ ఒరిజినేటింగ్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 25న సంత్రాగచ్చి-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22807), షాలిమార్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (22853), 26న విశాఖ-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ (22854), 27న చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్ (22808) రైళ్లను రద్దు చేశామని పేర్కొన్నారు.

కొత్తపల్లి ఎంపీపీ స్కూల్ టీచర్ సస్పెన్షన్

కశింకోట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ఆర్.దేవీకుమారిని సస్పెండ్ చేస్తూ డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో సమయం పాలన పాటించడంలేదని, స్థానికుల నుంచి కూడా పలు పర్యాయాలు ఫిర్యాదు అందాయని పేర్కొన్నారు. తీరు మార్చుకోవాలని సూచించినా పట్టించుకోకపోవడంతో విధుల నుంచి తొలగించాల్సి వచ్చిందని డీఈవో వెల్లడించారు.

నాణ్యమైన విద్యుదుత్పత్తే లక్ష్యం

సింహాద్రి ఎన్టీపీసీ హెచ్‌వోపీ సమీర్‌శర్మ

పరవాడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యుత్తును ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సింహాద్రి ఎన్టీపీసీ హెచ్‌వోపీ (హెడ్ ఆఫ్ ది ప్రాజెక్ట్) సమీర్‌శర్మ వెల్లడించారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యుత్ ఉత్పత్తితోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంలో కూడా ఎన్టీపీసీ ఎప్పుడూ ముందంజలో వుంటుందని చెప్పారు. సీఎస్ఆర్‌లో భాగంగా ఎన్టీపీసీ నిర్వాసిత గ్రామాల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. వైద్య శిబిరాలను నిర్వహించి ఉచితంగా మందులను అందజేస్తున్నామని చెప్పారు. నిర్వాసిత గ్రామాల్లో యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నామని, మహిళలకు కుట్టు శిక్షణతోపాటు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. బాలికా సాధికారిత కోసం ప్రతి ఏటా 'జెమ్' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీఎస్ విభాగం జీఎం పద్మప్రియ, ఈఎంజీ విభాగం ఏజీఎం విజయన్, హెచ్ఆర్ విభాగం ఏజీఎం బీబీ పాత్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సింహాద్రి ఎన్టీపీసీ హెచ్‌వోపీ సమీర్‌శర్మ

గంజాయి కేసుల్లో దోషులందరికీ శిక్ష పడాలి

పటిష్ఠ దర్యాప్తుతోనే ఇది సాధ్యం: ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి, మాదక ద్రవ్యాల కేసులను పటిష్ఠంగా దర్యాప్తు చేసి శిక్షల శాతం పెరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా సూచించారు. స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శుక్రవారం అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పోలీస్ అధికారులకు.. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణ చట్టాలు, దర్యాప్తు విధానాలపై నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ప్రత్యేక వర్కుషాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు గంజాయి రవాణా విషయంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలు ప్రధాన మార్గాలుగా ఉన్నాయన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల్లో గంజాయి కేసులు నమోదు అవుతున్నాయన్నారు. గంజాయి కేసుల దర్యాప్తులో అధికారులు మంచి ప్రతిభకనబరుస్తున్నారని, అయితే కేసులు న్యాయస్థానంలో విచారణకు వెళ్లినప్పుడు కొన్ని కేసులు వీగిపోతాయని, ముద్దాయిలందరికీ శిక్షలు పడడం లేదని పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయడం నుంచి చార్జీషీటు దాఖలు వరకు అన్ని ప్రొసీజర్స్‌ను కచ్చితంగా పాటించాలన్నారు. గంజాయిని పట్టుకున్నప్పుడు గెజిటెడ్ అధికారి ఆధ్వర్యంలో మధ్యవర్తుల సమక్షంలో సీజ్ చేయాలన్నారు. 161 స్టేట్‌మెంట్ రికార్డు చేసిన తరువాత వాటిని మధ్యవర్తులకు చదివి వినిపించాలన్నారు. గంజాయి శాంప్లింగ్ ప్రొసీజర్‌ను న్యాయమూర్తి సమక్షంలో చేయించాలన్నారు. తద్వారా ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ వర్కుషాపులో శిక్షణ ఇచ్చిన కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ టాక్స్ అప్పీలేట్ అధికారి ఎ. రంగధామ్‌ను ఈ సందర్భంగా పోలీస్ అధికారులు సత్కరించారు. వర్కుషాపులో అదనపు ఎస్పీ(క్రైమ్) ఎల్.మోహనరావు, ఎస్బీ డీఎస్పీ బి.అప్పారావు, ఇన్‌స్పెక్టర్లు ఎస్.లక్ష్మణమూర్తి, ఎస్. బాలసూర్యారావు, జి.ప్రేమ్‌కుమార్, గపూర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

కేజీబీవీల్లో నైట్ డ్యూటీ సమస్యను పరిష్కరించాలి

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల(కేజీబీవీ)లో సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి చిన్నబ్బాయి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యా శాఖ కార్యాలయంలోని డీఈవో అప్పారావునాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. పనిచేస్తున్న టీచింగ్ స్టాఫ్ నైట్‌డ్యూటీ సమయాన్ని మరుసటి రోజు తొమ్మిది నుంచి 11 గంటల వరకు పెంచడం ఇబ్బందికరంగా ఉందన్నారు. వారానికి రెండు నైట్‌డ్యూటీలు చేయాల్సి రావడంతో తీవ్ర పనిఒత్తిడి, అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు.



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న చిన్నబ్బాయి, టీచర్లు

గ్రూప్-2 అభ్యర్థుల ఆందోళన



ఎంవీపీ కాలనీలోని సర్కిల్ వద్ద శుక్రవారం రాత్రి ఆందోళన నిర్వహిస్తున్న అభ్యర్థులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పోస్టుల భర్తీకి సంబంధించి రోస్టర్ విధానాన్ని సవరించాలని కోరుతూ మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులు శుక్రవారం రాత్రి ఎంవీపీ సర్కిల్ వద్ద ఆందోళన నిర్వహించారు. వందలాది మంది సెల్‌ఫోన్ లైట్లు ఆన్ చేసి..రోస్టర్ విధానాన్ని సవరించిన తరువాతే మెయిన్స్ నిర్వహించాలంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ సమస్యను గుర్తించి పరిష్కరించాలంటూ డిమాండ్ చేశారు. ఈ విషయం తెలిసి ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అక్కడకు చేరుకున్నారు. ఆందోళనకారులతో మాట్లాడారు. మంత్రి నారా లోకేష్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లామని, సానుకూల నిర్ణయం వస్తుందని చెప్పారు. ఇదే కూడలిలో మధ్యాహ్నం కూడా అభ్యర్థులు ఆందోళన నిర్వహించారు.

లలితా ఫెర్రో కంపెనీకి తాళాలు

... 5వ పేజీ తరువాయి

పునరుద్ధరించకపోవడంతో ఖాళీగానే వుంటున్నారు. ఈ నేపథ్యంలో కార్మికులు 18వ తేదీ నుంచి విధులకు రావాల్సిన అవసరం లేదంటూ 17వ తేదీన యాజమాన్యం ప్రకటించింది. దీంతో కార్మికులు మరోసారి ఆందోళనకు దిగారు. 25వ తేదీన బకాయి జీతాలు చెల్లిస్తామని, అంతవరకు విధులకు హాజరుకావాలని యాజమాన్య ప్రతినిధులు చెప్పడంతో కార్మికులు అంగీకరించి ఆందోళన విరమించారు. అయితే శుక్రవారం ఉదయం విధులకు వచ్చిన కార్మికులు... ప్రధాన గేటుకి తాళం వేసి వుండడాన్ని చూసి మండిపడ్డారు. గేటు వద్ద ఆందోళనకు దిగారు. కొద్దిసేపటి తరువాత యాజమాన్య ప్రతినిధులు వచ్చి తాళం తీశారు. కానీ కార్మికులను లోపలికి రానివ్వలేదు. సుమారు గంట తరువాత ఒక నెల జీతాలు బ్యాంకు ఖాతాల్లో పడినట్టు కార్మికుల మొబైల్ ఫోన్లకు మెసేజ్‌లు వచ్చాయి. అయినా సరే ఆందోళన విరమించలేదు. బకాయి వున్న మరో నెల జీతంతోపాటు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కర్మాగారాన్ని మూసేస్తున్నందుకు అదనంగా ఒక నెల జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్ఐ సుధాకర్ హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు.

క్రైం... crime news

ఆత్మహత్యకు యత్నించిన యువతి మృతి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత.. విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. కస్పావీధికి చెందిన షేక్ అబ్దుల్ ఘనీ, సాగి సుబ్బరాజువీధికి చెందిన మంగారపు జ్యోతి(29) ప్రేమించుకుని 2023 సెప్టెంబరు 19న వివాహం చేసుకున్నారు. ఘనీ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఏడు నెలల క్రితం వీరికి ఒక బాబు పుట్టాడు. జ్యోతి కొన్నాళ్ల నుంచి సాగిసుబ్బరాజువీధిలో తల్లి కుమారి వద్ద ఉంటున్నది. ఈ నెల 18వ తేదీన అబ్దుల్ ఘనీ భార్య జ్యోతి వద్దకు వచ్చాడు. కొద్దిసేపటి తరువాత తనను బయటకు తీసుకెళ్లాలని జ్యోతి తన భర్తను కోరింది. మధ్యాహ్న సమయంలో బయటకు ఎందుకుంటూ ఆమె తల్లి ప్రశ్నించింది. దీంతో మనస్తాపం చెందిన జ్యోతి ఇంటి పైనున్న గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని, భర్తకు వాట్సాప్ కాల్ చేసి తాను చనిపోతున్నట్టు చెప్పింది. దీంతో భర్త, తల్లి, ఇతర కుటుంబ సభ్యులు వెళ్లి తలుపులు బలవంతంగా తీశారు. జ్యోతి చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడుతూ కనిపించింది. వెంటనే కిందకు దించి చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా వుండడంతో విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. జ్యోతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్ఐ ఈశ్వరరావు చెప్పారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

ఎక్స్‌కవేటర్, మూడు ట్రాక్టర్లు సీజ్



పోలీసులు సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు

మాకవరపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టి అక్రమ తవ్వకాలు జరుపుతున్న ఎక్స్‌కవేటర్‌తోపాటు మూడు ట్రాక్టర్లను సీజ్ చేశామని ఎస్ఐ దామోదర్‌నాయుడు అన్నారు. శెట్టిపాలెం శివారు వెంకన్నపాలెంలో శుక్రవారం అర్ధరాత్రి ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుపుతున్నారన్నారు. ఈ మట్టితో ప్రైవేటు ఇళ్ల పునాదులను కప్పుతున్నారన్నారు. ప్రతి రోజూ రాత్రి సమయాల్లో మట్టి తవ్వకాలు చేస్తున్నారని, రోడ్లపై వేగంగా వాహనాలు నడుపుతున్నారన్నారు. ముందస్తు సమాచారంతో దాడి చేసి ఒక ఎక్స్‌కవేటర్, మూడు ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

నరవలో సగం కాలిన మృతదేహం

- హత్య చేసి దహనం చేసే యత్నమేనని అనుమానం
- మృతుడికి 30 ఏళ్ల వయసుంటుందని అంచనా
- ఆధారాల కోసం పోలీసుల అన్వేషణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగర పరిధిలోని నరవ గ్రామ సమీపంలో సగం కాలిన మృతదేహం లభ్యమవ్వడం స్థానికంగా కలకలం రేపింది. హత్య చేసి, ఆనవాళ్లు దొరక్కుండా చేసేందుకు దహనం చేసి ఉంటారని భావిస్తున్నారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.

నరవ సమీపంలోని కొండవాలు ప్రాంతంలో సగం కాలిపోయిన వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. పెందుర్తి సీఐ సతీశ్‌కుమార్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. మృతుడికి సుమారు 30 ఏళ్ల వయసు ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు. హత్యకు గురైన యువకుడు ఎవరు?, అదే స్థలంలో హత్య చేసి, మృతదేహాన్ని దహనం చేసే ప్రయత్నం చేసి ఉంటారా లేక ఎక్కడో హత్య చేసి, మృతదేహాన్ని ఇక్కడికి తీసుకువచ్చి తగలబెట్టేందుకు యత్నించారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, సీఐ సతీశ్‌కుమార్ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

600 కిలోల గంజాయి పట్టివేత

... 5వ పేజీ తరువాయి

కొనుగోలు చేశాడు. దీనిని పాయకరావుపేట మండలం గోపాలపట్నం సమీపంలోని సూదికొండ వద్దకు చేర్చడానికి జీకే వీధి మండలం మొండిగెడ్డ గ్రామానికి చెందిన ఒక వ్యక్తితో రూ.5 లక్షలకు బేరం కుదుర్చుకున్నాడు. అతను మరో ఇద్దరు వ్యక్తుల సాయంతో బొలేరో వాహనంలో గంజాయిని పాయకరావుపేట మండలం గోపాలపట్నం సమీపంలోని సూదికొండ వద్దకు చేర్చారు. అనంతరం బొలేరో వాహనం అక్కడి నుంచి వెళ్లిపోయింది. దీనిపై సమాచారం అందుకున్న స్థానిక సీఐ జి.అప్పన్న, సిబ్బందితో వెళ్లిదాడి చేశారు. 17 గోనె సంచుల్లో ప్యాకింగ్ చేసిన గంజాయిని స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరితోపాటు గంజాయి, ఒక కారు, రెండు బైక్‌లను స్టేషన్‌కు తరలించారు. వీరు ఇచ్చిన సమాచారంతో పీఎల్.పురం జంక్షన్ వద్ద ఒక హోటల్‌లో మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని తూకం వేసి 600 కిలోలు వున్నట్టు నిర్ధారించారు. ప్రధాన నిందితుడైన గుంటపల్లికి చెందిన వ్యక్తిపై ఇప్పటికే ఆరు గంజాయి కేసులు వున్నాయి. దీంతో అతనిపై పీడీ యాక్టు కింద కేసు నమోదు చేస్తామని ఎస్పీ చెప్పారు. ఇతను గతంలో గంజాయి కేసులకు సంబంధించి జైలులో రిమాండ్ ఖైదీగా వున్నప్పుడు ఇతర రాష్ట్రాలకు చెందిన గంజాయి నిందితులతో పరిచయం ఏర్పరచుకుని, బెయిల్‌పై బయటకు వచ్చిన తరువాత గంజాయి సరఫరా చేస్తున్నాడని తమ దర్యాప్తులో తేలిందన్నారు. ఏజెన్సీ నుంచి గంజాయిని బొలేరో వాహనంలో ఇక్కడకు తీసుకువచ్చిన ఇద్దరు వ్యక్తుల కోసం గాలింపు చర్యలుచేపట్టామని చెప్పారు. గంజాయితోపాటు పట్టుకున్న నిందితుల్లో ముగ్గురు గుంటపల్లి, ఒకరు కాకినాడ, మరొకరు నర్సీపట్నంకాగా, హోటల్ వద్ద పట్టుకున్న ముగ్గురు ఏజెన్సీకి చెందిన వారని ఎస్పీ తెలిపారు. భారీ మొత్తంలో గంజాయిని పట్టుకున్న సీఐ జి.అప్పన్న, ఎస్ఐ పురుషోత్తం, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లోడు క్రమబద్ధీకరణ

... 5వ పేజీ తరువాయి

కనీసం 5 కిలోవాట్ల విద్యుత్ లోడ్‌కు సరిపడా ఫీజులు చెల్లించాలి. కానీ చాలా మంది కిలోవాట్, రెండు కిలోవాట్లకే ఫీజులు కట్టి అధిక విద్యుత్ వినియోగిస్తున్నారు. ఇలాంటి వారంతా ఇప్పుడు వారి కనెక్షన్లను వాస్తవ లోడ్‌తో క్రమబద్ధీకరించుకోవచ్చు. వీరు కిలోవాట్ల లెక్కన సెక్యూరిటీ డిపాజిట్‌తో పాటు అదనపు డెవలప్‌మెంట్ ఫీజులు కట్టాలి. ఇందులో ఫీజులో 50 శాతం రాయితీ లభిస్తుంది.

చికెన్ ధరలు

బ్రాగ్	రూ.లలో
రైతు ధర	75.00
లైవ్ ధర	95.00
విత్ స్కిన్	160.00
స్కిన్ లెస్	170.00

కోడి గుడ్డు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	445
విజయనగరం	449
శ్రీకాకుళం	449